# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



VOLUME 32 ISSUE 6

No. OF PAGES 40

FEBRUARY 2013

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన

చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో**............................ ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 7 |
| సన్నిధిలో సంభాషణ | 10 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 12 |
| యోగవాశిష్ఠము | 13 |
| గురు కృపాహి కేవలమ్ | 15 |
| ఆత్మసాక్షాత్కారమెట్లు కలుగును? | 17 |
| అపజయమే అహంకార భంగం | 19 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 20 |
| పరిప్రశ్నేన సేవయా | 22 |
| బాలకృష్ణుని తీయని వేణుగానం | 23 |
| స్థిత ప్రజ్ఞుడు | 25 |
| విశ్వాసమే భక్తి | 27 |
| భగవంతుని ఆశీర్వదించిన ఆళ్వారు | 29 |
| అజ్ఞానం | 31 |
| చందాదారులకు విజ్ఞప్తి | 33 |
| శ్రీసద్గురు రజతోత్సవ వేడుకలు | 34 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 35 |
| శ్రీరాధామాధవ రస సుధ | 37 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాన్ శ్చరతి నిస్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాన్తి మధిగచ్ఛతి ॥ (భ. అ -2, శ్లో॥71)

ఎవరైనా భక్తులు 'అశాంతిగా ఉంది' అని సద్గురుదేవులకు విన్నవించినప్పుడు, ఆయన "ఆశాంతి ఎందుకు వచ్చింది? బయట నుంచి వచ్చిందా? నీ లోపల నుంచే వచ్చిందా?" అని ప్రశ్నించేవారు.

"ఏ కోరికలూ లేనివాడు, విషయాదులకు వికృతముకాని మనస్సు కలవాడు తప్పక శాంతిని పొందుతాడు. మానవులెవరైనా శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములకు వికృతము చెందక, సమస్త కోరికలను త్యజించి నిరహంకారియై మమకార వర్జితుడై సంచరించినవాడు తప్పక శాంతిని పొందగలుగుతాడు. అటువంటి శాంతిని పొందగలిగినవాడే స్థితప్రజ్ఞుడు.



విషయవాసనలను త్యజించుట సహజమేకాని వాటిని గూర్చి ఏమాత్రమూ ఆకాంక్షగాని, సంస్మరణగాని చేయటం వలన శాంతికి భంగం కలగవచ్చు.

పరమశాంతిని అనుభవించే స్థితప్రజ్ఞుడు నాలుగు సాధనములకు అధికారి. సమస్తమైన కోరికలను త్యజించుట, వాటిని గూర్చిన సంస్మరణ చేయకపోవుట, నిరంహకార భావన, దేహమునందు మమత్వమును త్యజించుట.

సముద్రమును జేరు జలముగాని, వర్షపునీరుగానీ యాదృచ్ఛికముగా చేరు ప్రక్రియేగాని, సముద్రము ఆ జలములు తనలో చేరవలెనని ఎప్పడూ వాంఛించదు. అదేవిధంగా స్థితప్రజ్ఞుడు ఏ విషయము నందు కూడా ఆసక్తి ఉండదు. కాని దైవికంగా శబ్దాది విషయాదులు తటస్థించినా వాటికి స్పందించక నిర్వికారుడై ఉంటాడు. అటువంటి వానికి శాంతికి లోటేముంది?

కానీ సామాన్య మానవులు భోగ్య పదార్థములు లభించినప్పుడు, శబ్దాది విషయాలు వచ్చిపడినప్పుడు వికారవంతులై, చపలచిత్తులై ఉండక మానగలుగుతారా? అటువంటివారికి శాంతి ఎక్కడిది??" అన్నారు శ్రీబాబు.

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

**20. ఎదుటనున్నవాని నెప్పుడుఁ గానక**
**కుదుటివాని వెదుకఁ బదరుచుండ్రు**
**పదట కొడుకులకును భయమేల గల్గదు?**
**విశ్వదాభిరామ! వినురామ వేమ!**



తాత్పర్యము -
మూర్ఖులు బట్ట బయలుగా ఉన్న బ్రహ్మమును చూడలేక మారు మూలల దేవునికొరకు వెదకుదురు. అట్టి వ్యర్థులకు భయమేల కలుగ లేదో తెలియకున్నది.

**21. ఎలుగుతోలు తెచ్చి యెన్నాళ్ళు నుదికిన**
**నలుపు నలుపేకాని తెలుపు కాదు**
**కొయ్యబొమ్మ తెచ్చి కొట్టిన పలుకునా?**
**విశ్వదాభిరామ! వినురామ వేమ!**

తాత్పర్యము -
ఎలుగుబంటి తోలును ఎన్నాళ్ళ ఉతికినను దాని నలుపు పోయి తెలుపు రాదు. కొయ్యబొమ్మను ఎంత కొట్టినను అది పలకదు. అట్లే మూర్ఖునకెంత చెప్పినను బోధ పడదు.

**22. ఒకనిఁజెఱుతు మంచు నుల్లమందెంతురు**
**తమకుఁగలుగు చేటు తా మెఱుఁగక**
**తమ్ముఁజెఱుచువాఁడు దైవంబు కాఁడొకో**
**విశ్వదాభిరామ! వినురామ వేమ!**

తాత్పర్యము -
ఇతరులకు హాని చేయదలచినచో తమకే హాని కలుగునని మూర్ఖులెరుగకున్నారు. ఒకరిని చెరపదలచిన, దైవమే తమ్ము చెరుపగలడు.

# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

'సృష్టికర్త భగవానుడే కదా! మరికొందర్ని ఎర్రగా, కొందర్ని నల్లగా అలాగే ధనవంతులు, పేదవాళ్లు, కుంటివాళ్లు, గుడ్డివాళ్ళు అనే తేడాలు ఎందుకు వుండాలి?' అని భక్తులు లేవదీసిన సందేహానికి సమాధానంగా శ్రీ బాబూజీ మహరాజ్ బోధిస్తూ,,,,,



"భగవానుడు ప్రేమమూర్తి, అంతేకాని పక్షపాతము ఎన్నడూ చూపడు. సృష్టియావత్తూ శ్రీమన్నారాయణుని నుంచి వచ్చినట్లుగా మన నారాయణోపనిషత్తు తెలియజేస్తుంది. సృష్టి ఎలా వచ్చింది అనే విషయంమీద మన శాస్త్రజ్ఞులు రీసెర్చిచేశారు. చివరికి తెలుసుకోలేక పోయారు. చెట్టుముందా? విత్తుముందా? ఈ విషయాన్ని ఏ శాస్త్రజ్ఞుడు వివరిస్తాడో చెప్పమనండి చూద్దాం!" అన్నారు.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "భగవానుడు మానవుడిని సృష్టించాడు. ఇంద్రియాలు ఇచ్చాడు. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే అంతరింద్రియాలనిచ్చాడు. సుగుణవంతుడవ్వమన్నాడు కాని! గుణహీనుడిగా అవ్వమని చెప్పలేదుగా! పోనీ అంతటితో ఊరుకున్నాడా! ప్రేమమూర్తి. అవ్యాజ కరుణామూర్తి అయిన భగవానుడు తానే స్వయంగా సగుణమూర్తి అయి అవతరించి మానవుని సత్క్రమార్గములో నడిపించి మానవ జన్మవచ్చినందుకు సద్వినియోగం చేసుకుని తరించమని ఉద్బోధిస్తున్నాడు. అంతేకాదు. మహాత్ముల రూపంలో ఆవిర్భవించి ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను మానవులకి అందజేసారు. కాని మానవుడు వీటన్నింటిని విస్మరించి భిన్నంగా ప్రవర్తించడానికి కారణం ఏమిటి? గుణసహితుడైన మానవుడు మనస్సు అనే మాయకులోబడి విచ్చలవిడిగా సంచరించి బుద్ధిహీనుడై, వివేకాన్ని కోల్పోయి. దుష్కృత కర్మని మూటకట్టుకుంటున్నాడు. అదే వాసన అని పిలువబడుతుంది.

తనతోపాటు తెచ్చుకున్న సంచితార్థకర్మ శేషము అనుభవించ వలసినదే కదా అదే వాసన అని పిలువబడుతుంది. జన్మాంతర వాసనలు పునర్జన్మకు తీసుకువస్తాయి కదా! దాని ఫలితమే మానవునిలో వ్యత్యాసానికి కారణం. తాను చేసిన దుష్కృత కర్మద్వారా సంభవించిన పరిణామానికి భగవంతుని నిందిస్తే ఏమిలాభం చెప్పండి? అయినప్పటికి ప్రేమమూర్తి అయిన భగవానుడు సద్గురు

మూర్తిగా అవతరించి, తనను ఆశ్రయించి త్రికరణ శుద్ధిగా తను, మనో, ధనములను సమర్పించి సేవించిన సాధకుల జన్మాంతర కర్మశేషాన్ని రహితం చేయడానికి సంసిద్ధుడై వున్నాడు.

మరి మానవులు ఎంతమంది ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటున్నారు? అలా సద్వినియోగం చేసుకోని మానవులు కర్మని అనుభవిస్తున్నారు. దానికి భగవంతుణ్ణి తప్పుపడితే ఎలా!"

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "ఒక పొలంలో కొన్ని మొక్కలు పుష్టిగా పెరుగుతాయి మరికొన్ని మొక్కలు బలహీనంగా వుంటాయి. రెండు రకాల మొక్కలు ఒకే క్షేత్రంలో వున్నవే కదా! ఆ క్షేత్రంలో వున్న అన్ని మొక్కలకి నీరు, ఎరువు సమానంగానే అందజేయ బడ్డాయి. మరి పెరుగుదలలో వ్యత్యాసానికి కారణం ఏమిటో చెప్పండి. మీరంతా చదువుకొన్నవారే కదా! ఆ క్షేత్రంలో నాటిన బీజాలలో కొన్ని బలమైనవి, కొన్ని బలహీనమైనవి కాబట్టి పెరుగుదలలో వ్యత్యాసం వచ్చింది.

ఇద్దరు భక్తులు వున్నారు. వారు ఇద్దరూ ఒకేరోజు ఒకే గురుమూర్తివద్ద లక్ష్యార్థం తీసుకున్నారు. వారి ఇద్దరి ప్రవృత్తిలో తేడా రావడానికి కారణం? గురుమూర్తిని తప్పుపడతారా, వారికి ఇచ్చిన లక్ష్యార్థంలో తేడావుందా? ఎన్నడూ కాదు. వారి ఇరువురూ చేసే సాధనలో తేడా వుండటం వల్లననే వారి ప్రవృత్తిలో తేడా వచ్చింది అంతేకదా!

ఒకాయన భక్తుడే. మంచి సాధకుడు కూడా. లక్ష్యార్థం ప్రసాదించమని కోరాడు. ఆ మరునాడు ఇస్తానని చెప్పాను. లక్ష్యార్థం తీసుకున్నవారు కనీసం మూడు మండలాలు. గురుసాన్నిధ్యంలో వుండి సాధనచెయ్యాలి.

ఆ వ్యక్తి ఉద్యోగస్తుడు కాబట్టి నియమాలను పక్కన పెట్టి. మూడు రోజులు ఉండి సాధన చేసుకొంటావా? అని అడిగాను. దానికి అంగీకరించాడు. అనుకొన్న విధంగానే ఆ మరునాడు లక్ష్యార్థం ప్రసాదించాను. లక్ష్యార్థం తీసుకున్న మరుక్షణం తాను వెళ్ళిపోవడానికే సంసిద్ధుడై నా అనుమతికోసం నిరీక్షించే వ్యక్తిని ఏమనాలి! అటువంటి వారి విషయంలో గురుమూర్తి బాధ్యత ఎంతవరకు?"

'సాధన ఎంతకాలం చేయాలి? మానవుడు జీవించినంతవరకు సాధన చేయవలసినదేనా?' అని ఒక భక్తుడు వ్యక్తం చేసిన సందేహానికి సమాధానంగా శ్రీ బాబూజీ మహరాజ్ బోధచేస్తూ "మానవ శరీరం భగవంతుడు సాధన కొరకు ప్రసాదించిన యంత్రం అంతేకాని! గుణహీనుడై దుర్వినియోగపరచే పరికరం మాత్రంకాదు. మానవుడు తన జీవిత పరమార్థం ఏమిటో తెలుసుకోవటానికి తన దేహాన్ని వినియోగించాలి గాని, విచ్చలవిడిగా సంచరించడానికి మాత్రం కాదు.

మానవుడు చేసే సేవ అంత్యకాలంలో మనస్సు భగవన్నామముపై నిలబడటానికే కదా! మరి ఆ అంత్యకాలం ఎప్పుడు సమీపిస్తుందో చెప్పగలవాడెవడైనా వున్నాడా? మానవుడు వదిలే ప్రతి శ్వాస అంత్యశ్వాసే కావచ్చు. ఈ క్షణమో, మరుక్షణమో కావచ్చు. ప్రతిక్షణము ప్రమాదభరితమైనదేకదా! అందువలన అంత్యకాలం ఎప్పుడు సమీపిస్తుందో తెలుసుకొనే బదులు అనుక్షణము నీ మనస్సు భగవన్నామస్మరణలో లగ్నమై ఉంచినట్లయితే. అది చక్కని సాధన అవుతుంది. అప్పుడు నిర్భయంగా వుండవచ్చు.

నీ మనస్సు నిశ్చలస్థితిలో వుందా? ఏ రకమైన సంకల్పమునకూ, తావియ్యకుండ సుఖదుఃఖాలకు, శీతోష్ణాలకు, రాగద్వేషాలకు, అతీతంగా వుందా? నీవు ఓంకారం పూరించేసరికి, నీ మనస్సు భగవానుని దివ్యచరణారవిందములపై నిలిచి వుండగలదా? నీవు ఆశ్రయించిన దైవకార్య నిమిత్తం నీ స్వకార్యాలందేదైనా త్యాగం చేయగలవా? అలాగయితే, నువ్వు సాధన చేయనవసరంలేదు.

నీ మనస్సు ద్వైత భావంతో సుఖం కలిగినప్పుడు సంతోషిస్తూ, కష్టం కలిగినప్పుడు, దుఃఖిస్తూ ఉన్నంతకాలం, నీ సాధన కొనసాగించవలసిందే, నీ మనస్సు అంతర్ముఖమై ఆత్మయందే రమించినపుడు నువ్వు సాధన చేయలసిన అవసరం ఏమున్నది? అట్టి స్థితిని పొందవలెనంటే సమర్థులయిన సద్గురు మూర్తిని ఆశ్రయించి, ఆయన అభయహస్త కిరణములో విశ్రమించినపుడే అది సాధ్యపడుతుంది.

*



గత సంచిక తరువాయి

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

ఏ టైముకి ఏ విధంగా చేయించుకుంటాడో ఆ భగవంతుడికే ఎరుక. అది సాధకుని సత్య అనుభూతిని బట్టి కూడా ఉంటుంది. సత్యానుభూతిని పొందాలంటే మొదట సాధకుడు 'నాకు ఏమీ తెలియద'ని ముందుగా గుర్తించాలి. 'నాకు అన్నీ తెలుసు' అనుకుంటే అహంకారం మనని పడగొట్టి వేస్తుంది.

అలనాడు బృందావనంలోని గోపబాలురు గోపికలు 'మా కృష్ణ బావ తప్ప మాకేమీ తెలియదు' అని గోపాలుని తత్త్వాన్నే నిరంతరం త్రాగుతూ ఉండేవారు. 'గో' అంటే జ్ఞానాన్ని, నిరంతరం పానం చేసి (త్రాగి)న వారు కనుక వారు గోపికలయ్యారు. ఏ పని చేస్తున్నా అహర్నిశలూ వారికి కృష్ణనామ స్మరణే. అది తప్ప వారికి రెండో విషయం తెలియనే తెలియదు. ఏకైక భావన కలిగి ఉండేవారు. ఇంట్లో పనులు చేస్తున్నా, అవి కృష్ణయ్య చేయమన్నాడు కనుక చేసేవారు. వారి ధ్యాస నిరంతరం కృష్ణ.....కృష్ణ......కృష్ణ అంతే! కృష్ణ నామామృతంలో ఓలలాడేవారు.



కృష్ణయ్య నందుడి బిడ్డడు. నందుడేమో మహారాజాయే. ఎప్పుడు పడితే అప్పుడు మహారాజు బిడ్డని చూడలేము కదా!

పాలకొల్లులోనే ఉన్నా క్షీరా రామలింగేశ్వర స్వామి దర్శనం ఎప్పుడు కావాలంటే అప్పుడు చేసుకోలేము. ఆయన చుట్టూ ఉండి సేవ చేసుకొనేవారికి విశ్రాంతి కోసం గుడి తలుపులు వేసేస్తారు. కాని దేవుడు గుడిలోపల ఉండేవాడు కాదు కదా. అలాగే నందమహారాజు కొడుకైన కృష్ణుడి దగ్గరకు వెళ్ళటం ఏమైనా తేలికా? ఆయన అసలే చిలిపివాడు. పూతనతో మొదలు పెట్టి శకటాసురుడు, తృణావర్తుడు, ధేనుకాసురుడు, బకాసురుడు, అఘాసురుడు - అబ్బా! ఎంతమంది రాక్షసులని చంపుతూ వచ్చాడా చిన్ని కృష్ణుడు! ఏ రాక్షసుడో, ఏ గోపికో వచ్చి తన చిన్నారి బాలుణ్ణి ఎత్తుకుపోతారని యశోదమ్మ ఆయన్ని కాస్తా దాచేసేది. దాస్తే దాగేవాడా ఆయన?

ఆ కృష్ణయ్యని భర్తగా పొందటానికి గోపికలందరూ కలసి కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారి సైకత విగ్రహం చేసి ఆరాధించటం మొదలు పెట్టారు. వ్రతం పూర్తి అయ్యేవరకూ ఊరుకుంటాడా ఆ నల్లనయ్య? "ఆ ఇసుక విగ్రహానికి పూజలేం చేస్తారు? నాకే డైరెక్టుగా చేసుకోండి" అని వేణువుని పూరించసాగాడు. ఇప్పటి భక్తులు కూడా అంతే. డైరెక్టుగా ఇలా చేయండి అంటే చేయరు. అప్పుడు వాళ్ళకి ఏ ఏకాదశ

రుద్రాభిషేకాలో, లక్షనామార్చనలో చెప్పాలి. డబ్బులు బాగా ఖర్చు అయితేకాని వాళ్ళకి తృప్తి ఉండదు! కానీ గోపికలు అలా కాదు. కృష్ణుడు చెప్పింది చెప్పినట్లుగా చేశారు. తమదంటూ ఏమీ దాచుకోకుండా కృష్ణుడికి అర్పించుకున్నారు.

"మీరేపని చేస్తున్నా ***ఓం కృష్ణా ఓం కృష్ణా కృష్ణాయ నమః శ్యామ సుందర మదనమోహన కృష్ణాయ నమః***అనుకుంటూ ఉండండి!" అని చెప్పాడు కృష్ణుడు. గోపికలు అది అక్షరం తప్పకుండా ఆచరించారు. కనుకనే వారు అనంత జ్ఞానాన్ని పొంది ఆత్మనివేదన భక్తికి ప్రతీకలయ్యారు. మనం కూడా అట్టి తత్పరత, శ్రద్ధ కలిగి ఉంటే మనకీ జ్ఞానం లభిస్తుంది. కూరలు కోసుకుంటూ, బట్టలు సర్దుకుంటూ, స్కూటర్ నడుపుతూ, ఏపని చేస్తున్నా ఈ నామం అనుకుంటూ చేస్తే కష్టం తెలియదు. "ఇదే కర్మలో అకర్మ అంటే" అని గురుదేవులు చెప్పారు. ఇది వారి ముఖస్తుగా వచ్చిన దివ్యమంత్రం.

దీనిని బట్టి మనకు తెలుస్తున్నదేమిటంటే, జ్ఞానం సాధించటానికి అతి ముఖ్యమైనది శ్రద్ధ. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం। తత్పరః సంయతేంద్రియః" అని చెప్పాడు స్వామి. గోపికలు, గోపాలకులు కృష్ణుని పరిపూర్ణంగా నమ్మారు. వారిలో కించిత్ సంశయానికి కూడా చోటులేదు. శ్రద్ధ, తత్పరత కలిగి ఉంటే భగవంతుడిని చేరటం చాలా తేలిక. రోడ్డు మీద ఒక అడుగు, గుళ్ళో ఒక అడుగు ఉంచితే లాభం లేదు. మనం రోడ్డు మీదే వెళ్తున్నా మనస్సు మాత్రం గుళ్ళో శివుడిమీదనే ఉండాలి. గుళ్ళో ఉండి "ప్రభూ! నువ్విక్కడ కదలకుండా ఉండి అందరినీ కదిలిస్తున్నావా స్వామీ!" అని ప్రార్థించాలి. గుడిలో ఉండగా రోడ్డు గుర్తుకు రావటానికి వీల్లేదు. గుడిలో ఉన్నా, రోడ్డు మీద ఉన్నా మనస్సు మాత్రం భగవంతుని యందు నిలపటం ముఖ్యం. ఇది గృహస్థుకైనా సాధ్యమే, సన్యాసికైనా సాధ్యమే.

అందుకే గృహస్థాశ్రమ ధర్మం గొప్పదా, సన్యాసాశ్రమ ధర్మం గొప్పదా, అని మహేంద్రవర్మ అనే ఒక రాజుగారికి ధర్మ సందేహం వచ్చింది. తన సంశయం తీర్చుకోడానికి దేశం నలుమూలల నుంచి పండితులని ఆహ్వానించాడు. సచ్చిదానందుడు అనే ఒక సన్యాసి వచ్చి "రాజా! రెండు ధర్మాలు గొప్పవే" అన్నాడు. అప్పుడా రాజు అది నిరూపించమన్నాడు. అలాగేనని సచ్చిదానందుడు ఆ రాజును తనతో రమ్మనమన్నాడు. రాజుగారు తన రాజ్యాన్ని మంత్రులకు అప్పగించి, సన్యాసి వెంట వెళ్ళాడు.

వారిరువురూ పర్యటన చేస్తూ ఒక పొరుగు రాజ్యానికి చేరుకుంటారు. ఆ రాజ్యపు రాజకుమారికి స్వయంవరం జరుగుతున్నది. తమ పట్టపుటేనుగు కుండతో నీటిని ఎవరి తలపైన కుమ్మరిస్తే అతడు తన అల్లుడవుతాడని రాజుగారు చాటింపు

వేస్తాడు. రాకుమారి చేతిలో వరమాల పట్టుకుని వెళ్తోంది. ప్రక్కనే ఒక నీటి కుంభంతో పట్టపుటేనుగు, ఆ దేశపు మంత్రిగారు, రాజుగారు వెళ్తున్నారు. జనులందరూ ఆసక్తితో చూస్తున్నారు. ఏనుగు వెళ్ళి వెళ్ళి, ఊరి చివర అడవిలో ఒక చెట్టు క్రింద కూర్చుని ధ్యానం చేసుకుంటున్న ఒక సన్యాసి తలపై నీళ్ళు కుమ్మరించింది. వెంటనే మంత్రిగారు ఆ సన్యాసితో, "స్వామీ! మహారాజు చాటింపు ప్రకారం ఇప్పుడు మీరు ఈ రాకుమారిని పెళ్ళి చేసుకోవాలి. మీకు అర్ధరాజ్యం కూడా ఇవ్వబడుతుంది" అని స్వయవరం సంగతంతా చేప్పేసరికి, ఆ యువ సన్యాసి మరోమాట లేకుండా అక్కడి నుంచి పరుగు పెట్టడం మొదలు పెట్టాడు. ఆయన వెనుక రాజుగారు, మంత్రిగారు, రాకుమారి పరుగులు పెడుతున్నారు. "నీకు అర్ధరాజ్యం కాదయ్యా, పూర్తి రాజ్యాన్నే ఇస్తాను" అని రాజుగారు అరుస్తున్నా కూడా ఆ సన్యాసి తన పరుగుని ఆపలేదు. చివరకి వారెవరికీ అందకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఇదంతా చూస్తున్న మహేంద్రవర్మతో, సచ్చిదానంద స్వామి అంటారు "రాజా! నిజమైన సన్యాసం అంటే ఇది. సన్యాసి ధర్మం అంత విలక్షణంగా ఉండాలి. ఏది వచ్చి మీదపడినా చలించకూడదు. అందమైన రాజకుమారి, రాజ్యము వచ్చి వరిస్తానన్నా ఆ సన్యాసి వాటిని తృణప్రాయంగా ఎంచి, వద్దని పరుగు పెట్టాడు. కనుక సన్యాసధర్మం ఎంత గొప్పదో మీకు తెలిసింది కదా!" అంటాడు.

-సశేషం



విదేశేషు మాన్యః స్వదేశేషు ధన్యః
సదాచార వృత్తేషు మత్తోన చాన్యః
గురోరంఘ్రి పద్మే మనశ్చేన్నలగ్నం
తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ ॥

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

24.6.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "మామిడికాయ మనకి ఎంతో విలువైన తత్త్వబోధని అందజేస్తుంది. అది పచ్చిగా ఉన్నప్పడు అహంకారమనే పులుపుతో ఉంటుంది. సంసారవృక్షాన్ని గట్టిగా పట్టుకుని ఉంటుంది. అది పండుగా మారిన తరువాత ఉదయించిన సూర్యుని రంగులో ఉండి ఎంతో ఆకర్షణీయంగా మనస్సుకు ఆనందాన్ని నాసికేంద్రియానికి సుగంధాన్ని అందజేస్తుంది. రుచికి మధురంగా ఉంటుంది. ఆ మధుర పదార్థం అందించే ఆనందం మీరు పీల్చే ముక్కు పొడుం అందించ గలుగుతుందాండి రావుగారూ?" అని ప్రశ్నించారు. శ్రీరావుగారు మాట్లాడుతూ 'మిమ్మల్ని చూస్తే భయం వేస్తోంది. కోపంగా చూస్తున్నారు' అన్నారు.



శ్రీబాబు మాట్లాడుతూ "నిన్న మీరు నా గురించి చెప్తూ నా హస్త రేఖలన్నారు, జ్యోతిష్కులు అన్నారు, నన్ను ఒక మహాత్ముడిగా వర్ణించారు. నన్ను తారక పరబ్రహ్మము అని ఎంతోపైకెత్తి ఈరోజు నన్ను మళ్ళీ మామిడి కాయని చేస్తున్నారా? మామిడిపండు మామిడికాయ అవుతుందిటండీ? ఎవరో అవసరార్థ భక్తులకో కపట భక్తులకో తప్ప" అని అన్నారు. రావుగారు మాట్లాడుతూ 'నేను వెధవనండీ బాబు. నన్ను మీరే మార్చాలి' అని అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ "వేపకట్ట నాచేతిలోనే ఉందనుకోండి. దానికి గౌరవం లభించవచ్చు కాని దాని చేదెక్కడికి పోతుందండి? అయినా నేను మీలో ఉన్న మంచినే చూస్తాను కాని చెడుని చూడను. మీకు ఏమన్నా మొలగజ్జిగాని, తామరగాని ఉంటే నాకేమిటండి? మీరు ముక్కు పొడుం పీల్చినా, సిగరెట్ కాల్చినా, డ్రింక్ చేసినా, మరి ఏ ఇతర దుర్గుణాలు ఉన్నా అవి మిమ్మల్నే పాడుచేస్తాయి. వాటి విషయం నాకెందుకు? మీ శరీరం పరిణామంతో కూడిందే కదా! అది నశించేది. దానితో నాకు సంబంధం లేదు. నాక్కావలసింది మీలోని ఆత్మవస్తువు, నాలోనూ మీలోనూ అందరిలోనూ ప్రకాశించే ఆత్మవస్తువునే నేను దర్శిస్తాను. మీలోని చెడుని నేను చూడను.

రెండురోజుల క్రితం మీకేర్పాటు చేసిన సన్మాన సభలో 600 రూ॥లు పారితోషికం తీసుకొని మీరు ఉపన్యసించారు. మీరు ధనాన్ని తీసుకున్నా నా దృష్టి దానిమీదకు పోలేదు. కాని మీ ఉపన్యాసంతో అక్కడి వారందరినీ రంజింపజేసినందుకు సంతోషించాను. మహాత్ముల దృష్టి అలా ఉంటుంది.

మరి నిజమైన ధనికుడంటే ఎవరండీ వీరయ్య చౌదరిగారూ?" అని ప్రశ్నించారు. అయన సమాధానం చెప్పలేదు. శ్రీబాబు మాట్లాడుతూ "ఇక్కడ కూర్చున్న వారంతా ఏనాడైనా కన్ను మూసే వారే కదా? ఆ విషయాన్ని గ్రహించి ఎవరైతే తమ జీవిత పరమార్థం గ్రహించగలుగుతారో వారే ధనికులు. అంత్యకాలం వరకు భగవంతుని యందు విశ్వాసం ఎవరైతే కలిగిఉంటారో వారే విదేహ ముక్తులవుతారు. మిగిలినవారంతా జనన మరణ విషవలయంలో చిక్కుకుంటారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా మనస్సు చలించకుండా ఉండాలి కదా! వారే కృతార్థులవుతారు. కొంతమంది ఎంతో భక్తి ఉన్నట్లు నటించవచ్చు. నమస్కారాలు చేయవచ్చు. కాని వారు పరీక్షకు నిలబడాలి కదా.

ఇక్కడ మీకొక దృష్టాంతం చెపుతాను. ఒక మహారాజు ఉండేవాడు. ఆయన ఆస్థానంలో అనేక మంది పండితులుండేవారు. మహారాజు వారందరిని ఎంతో గౌరవించేవారు. ఒకనాడు ఆ మహారాజుగారి దర్శనార్థం ఒక సన్యాసి వచ్చాడు. మహారాజు ఆయన్ని గౌరవించి సపర్యలు చేసి నమస్కరించి వీడ్కోలు చెప్పారు. పండితులంతా మహారాజుగారి చర్యని అసహ్యించుకున్నారు. 'మహారాజుగారికి నిజంగా పిచ్చెక్కింది. లేకపోతే ఇంతమంది పండితులం మేముండగా ఈ బికారి సన్యాసిని గౌరవించటమేమిటి?' అని అనుకున్నారు.

ఇలా ఉండగా ఒకనాడు ఆ సామ్రాజ్యాన్ని శత్రురాజులు ముట్టడించారు. మహారాజుగారు తన మంత్రులను ఆస్థాన పండితులను అందరినీ పిలిపించి శత్రురాజుల ముట్టడిని గురించి చర్చించారు. పండితులంతా శత్రుసైన్యం ముట్టడించిందని తెలియగానే మహారాజు ఆస్థానాన్ని వదలి వెళ్ళిపోయారు. ఆ సమయంలో మహారాజు చిక్కుల్లో పడ్డారు. ఈ విషయం తెలిసిన సన్యాసి మహారాజు వద్దకు వచ్చి ఆయనను ఊరడించి ఆశీస్సులనందజేసి శత్రురాజుల ముట్టడి నుండి తప్పించుకునే మార్గాన్ని తెలియజేశాడు.

ఇప్పుడు మీరే చెప్పండి ఎవరు ఆ మహారాజుకు ఆప్తులో? అనుదినము ఆయనను ఆశ్రయించి ఆయన ఉప్పు తింటున్న పండితులా? లేక ఏ రకమైన ప్రతిఫలమూ ఆశించని ఆ సన్యాసా?" అని ప్రశ్నించారు.

ఇంతలో శ్రీపాండురంగ శ్రీశైలరావుగారు ప్రసాదాన్ని తీసుకువచ్చి స్వామికి నివేదన చేయబోయారు. శ్రీబాబు మాట్లాడుతూ "నేను బోధ చేస్తున్నంతసేపూ ఈ ప్రసాదాన్ని ఇక్కడే ఉంచి మీరంతా సువాసనలన్నీ ఆఘ్రాణించిన తరువాత నాకు నివేదన ఎందుకయ్యా? మీ ద్వారా నివేదన అయింది కదా! దానిని నేను స్వీకరించినట్లు కాదా! కాబట్టి వెంటనే మీ జిహ్వలకి ఆలస్యం చెయ్యకుండా రుచినందించండి" అని అన్నారు.

*

# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2013

5 మంగ శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

8 శుక్ర మాసశివరాత్రి

17 ఆది రధ సప్తమి

21 గురు భీష్మ ఏకాదశి, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం. పెదనింద్రకొలను శాఖలో శ్రీ సద్గురు దేవుల దివ్య మంగళమూర్తి నవమ ప్రతిష్టా వార్షికోత్సవం. శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్తసమారాధన.

25 సోమ మాఘ పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్తసమారాధన.

*మార్చి 2013*

6 బుధ శ్రీగురుదశమి సత్సంగ సమావేశము, శ్రీసద్గురుపాదపూజ

9 శని శని త్రయోదశి

10 ఆది మహా శివరాత్రి. తె.ఝా 3 గం. లకు బృందావనంలో శ్రీ సద్గురు దేవులకు రుద్ర, నమక, చమక సహితంగా మహాభిషేకం, 5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, 7.30 గం.లకు శ్రీ రామలింగేశ్వరస్వామికి సామూహిక రుద్రాభిషేకములు, 11 గం.లకు శ్రీ రామలింగేశ్వరస్వామికి సహస్ర ఘటాభిషేకము. లక్ష బిల్వార్చన, భక్త సమారాధన. సాయంత్రం 6.30.లకు శ్రీ మహాకాళికా పరమేశ్వరీ శ్రీ రామలింగేశ్వరుల లీలా కళ్యాణము. అనంతరము శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సహిత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి నగరోత్సవము,

14 గురు శ్రీలలితానందసరస్వతీస్వామిని ఆరాధన, శ్రీసద్గురుపాదపూజ

27 బుధ పూర్ణిమ హెూలీ. శ్రీసద్గురుపాదపూజ

## శ్రీమాతాజీవారి సత్సంగ సమావేశములు

1.) 11-2-2013 నుండి 13-2-2013 వరకు ప॥గో॥జిల్లా, నిడమర్రు మండలం, అడవికొలను గ్రామంలో శ్రీమాతాజీవారి ఆధ్వర్యంలో రుద్రయాగము, సత్సంగ సమావేశము జరుగును.

2.) 17-2-2013 నుండి 21-2-2013 వరకు పెదనింద్రకొలను శాఖలో వార్షికోత్సవ సందర్భంగా శ్రీమాతాజీవారిచే పంచాహ్నిక సత్సంగ సమావేశములు జరుగును.

**అందరూ ఆహ్వానితులే!**

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

దశరథ మహారాజు మునీంద్రుని కోరిక విని విచలితుడయ్యాడు. "ఓ! మునీంద్రా! రాముడు చాలా పిన్న వయస్కుడు. రాక్షస సంహారం చేసే సమర్థతగల పరిణత గల వయస్కుడు కాదు. పైగా నా ప్రియపుత్రుని యెడబాటును యీ వృద్ధాప్యంలో ఒక క్షణమైనా నేను సహించలేను" అని విశ్వామిత్రునికి విన్నవించుకున్నాడు.



విశ్వామిత్ర మహర్షి దశరథ మహారాజు సమాధానానికి ఆగ్రహావేశాలాకు లోనై యిలా ప్రత్యుత్తరం ఇచ్చాడు " మీరేమి కోరినా యిస్తానని వాగ్దానంచేశావు యిప్పుడు వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోతున్నావు. నీవు సత్యవాక్పరిపాలకుడవైన యిక్ష్వాకు వంశమహారాజువు ఎలా కాగలవు?" అని ప్రశ్నించాడు.

ఇంతలో వశిష్ఠ మహర్షి కల్పించుకుని దశరథ మహారాజుతో "మీరాడిన మాటను తప్పరాదు. విశ్వామిత్ర మహర్షి రాముని సంక్షరణ బాధ్యతను తానే స్వయంగా చూసుకుంటారు." అప్పుడు దశరథమహారాజు కుదటపడి తన పరిచారకులను వెంటనే రాకుమారుడు రామచంద్రుని, సభావేదికకు తీసుకు రమ్మనమని ఆజ్ఞాపించాడు.

అప్పుడు పరిచారకులు రాజుగారితో "యువరాజు తీర్థయాత్ర నుండి తిరిగి వచ్చినప్పటి నుండి అన్యమనస్కుడై, తన దైనందిన చర్యలను పట్టించుకోవటం లేదు. అన్నపానాదులు, వస్త్రధారణ యందు సంపూర్తిగా నిరాసక్తుడైనాడు. ఈ ప్రపంచము మిధ్యయని, జీవితాన్ని నిష్ప్రయోజనంగా గడుపుతున్నారు. ఒక విరాగి జీవితము గడుపుతున్నారు. సుఖ, దుఃఖముల కతీతమైన, జీవన్ముక్త స్థితిని చేరుకోవాలని కోరుకుంటున్నారు" అని చెప్పారు.

అప్పుడు వశిష్ఠమహర్షి రాజభటులకు రామచంద్రుని రాజదర్బారుకు తీసుకుని రమ్మనమని ఆదేశించారు. సభనుద్దేశించి వశిష్ఠమహర్షి "శ్రీరామచంద్రుడు వైరాగ్యసంపన్నుడైనాడని, త్వరలోనే ఆత్మజ్ఞానము పొంది, తన కర్తవ్య విధులను మహదానందంతో నిర్వహిస్తారని" చెప్పాడు.

శ్రీరామచంద్రప్రభువు రాజదర్బారుకు వచ్చి, తన గురుమూర్తియైన వశిష్ఠ మహర్షికి, విశ్వామిత్ర మహర్షికి, తన జనకుడైన దశరథ మహారాజుకు పాదాభివందనం

చేశాడు. అనంతరం విశ్వామిత్ర మహర్షి రామచంద్రునితో నీ హృదయంలో ఏమీ దాచకుండా, నీ విచారమునకు హేతువేమిటో వివరించమన్నాడు.

వెంటనే రామచంద్రుడు వినమ్రతతో " ఓ మహర్షీ! మీరాదేశించినట్లు నేను నా విచారానికి కారణాన్ని మీకు చక్కగా నివేదిస్తాను. సావధానులై వినండి" అన్నాడు.

*సంసారం* – (ప్రాపంచిక ఉనికి)

ఈ ప్రపంచం అనిత్యం, అసత్యం. జగత్తులో కించిత్ కూడా ఆనందం లేదు. పుట్టిన ప్రతివాడూ మరణించవలసినదే. మరణించిన ప్రతివాడూ తిరిగి జన్మిస్తాడు. ఈ జగత్తు అంతా మాయా జనితం. నేను వివేచనా శక్తిని పెంపొందించుకొన్నాను. అందుచేత భౌతిక సుఖాల గురించిన ఆలోచనలన్నీ విసర్జించాను. మనస్సు యొక్క మాయా స్వభావాన్ని గ్రహించాలి. మనస్సు యొక్క ప్రభావముచేతనే యీ జగత్తు సత్యమనే భ్రమలో పడ్డాము. ఆత్మ ఒక్కటే సత్యమైనది, నిత్యమైనది. నేను మాయామయమైన యీ జగత్తు పట్ల పూర్తిగా విరక్తి చెందాను. ఈ సంసారమనే ఊబిలో కూరుకుపోయి, ఆ దుఃఖానికి, బాధకు నివారణ మార్గమునకై, అన్వేషిస్తున్నాను. ఈ సంసారము ఒక దావానలం లాగా నన్ను దహించివేస్తున్నది.

*సంపద* –

సంపదల వలన ఆనందం లభిస్తుందని భ్రమలో ఉంటాడు మానవుడు. ఈ సంపద తాత్కాలికమైనది, చంచలమైనది. ఎవరి వద్దా స్థిరంగా ఉండకుండా చలిస్తుంది. ఈ సంపద మోసగించే ఎండమావిలాంటిది. దుష్టత్వానికి నాంది . సంపద మానవుడి గుండెను, రాతి గుండెగా మారుస్తుంది. దుష్కర్మ ద్వారా ఆర్జించిన ద్రవ్యము మానవుని గర్వాన్ని పెంపొందించి భగవంతుణ్ణి మరచిపోయేటట్లు చేస్తుంది.

*జీవితం* –

జీవితం నీటి బుడగలా తృణప్రాయమైనది. ఈ జీవితం దుఃఖాలు, సమస్యలతో నిండిన కష్టాల కడలి. కాని అవివేకియైన మానవుడు, భౌతిక జీవితాన్ని పట్టుకొని వేలాడుతుంటాడు. ఈ దేహము భారమైనది. ఈ జగత్తులోని జీవితం శ్రమతో, యాతనతో, బాధతో కూడుకొన్నది. మృత్యువు నిరంతరమూ, నీడలా వెంటాడుతుంది. అనేక రకములైన రోగాలు, దేహాన్ని పీడిస్తున్నాయి. మురిపించి, మరిపించే యౌవనం, తృటిలో మాయమవుతున్నది. వెంటనే వేదనాభరితమైన వృద్ధాప్యము, మానవుని రోజురోజుకూ బలహీనం చేసి నశింపజేస్తుంది. ఎవరైతే నిరంతరమూ, ఆత్మ విచారణ చేస్తాడో, ఎవరైతే ఆత్మజ్ఞానము ద్వారా, జనన మరణమనే సుడిగుండము నుండి బయటపడతాడో అతనే సత్యమైన, ఉదాత్తమైన జీవితాన్ని గడుపుతాడు.

– సశేషం

# గురు కృపా హి కేవలమ్

– రమణ ప్రసాద్

మిరకిల్స్ (మహిమలు) అని మనం భావించేవి గురుశక్తి వలన జరిగే సన్నివేశాలే. అవి మానవశక్తికి అందవు కనుక అవి మహిమలు అనుకుంటాం. నిర్మలమైన మనస్సుతో గురుస్మరణతో చేస్తే అసాధ్యాలు కూడా సాధ్యం అవుతాయి. జనవరి 3 వ తారీకున శ్రీకాళీప్రసాద్ (చిట్టి) నూతన గృహానికి శ్రీ మాతాజీవారు గృహప్రవేశ ముహుర్తం పెట్టారు. మరి వారు పెట్టిన ముహుర్తానికి తిరుగు ఉంటుందా? ఈ గృహ ప్రవేశం ఏ రీతిగా జరిగిందో శ్రీకాళీప్రసాద్ వివరిస్తున్నారు:

"గత సంవత్సరం డిశంబర్ 2011లో బెంగళూరులో జరిగిన సత్సంగ సమావేశాలు జరిగినప్పుడు అక్కడి 'బాబు భక్త సమాజ్' సభ్యులు వచ్చే ఏడు సత్యంగ సమావేశాలు ఎక్కడ జరగాలో చెప్పి అనుగ్రహించమని అమ్మను (మాతాజీవారిని) కోరారు. అమ్మ నన్ను చూసి "ఒరేయ్ చిట్టీ! నీ ఇల్లు ఎప్పటికి తయారు అవుతుందిరా?" అని అడిగారు. నేను "ఎలహెంకా'లో కడుతున్న 'సాహనా ఎపార్ట్‌మెంట్స్'లో ఒక ఫ్లాట్ బ్యాంక్ లోన్ సహాయంతో తీసికున్నాను. వారు నాతో అక్టోబర్ 2012 కి ఫ్లాటు ఇస్తామని చెప్పారు. ఆ ఫ్లాట్లు కడుతున్నది శ్రీరామ్ ప్రాపర్టీస్. వారిది పేరు పొందిన సంస్థ. అందుకని వారు చెప్పిన టైమ్‌కి ఫ్లాట్ హ్యాండోవర్ (handover)చేస్తారనే నమ్మకం నాకు వుంది. ఆ నమ్మకంతో నేను అక్టోబర్‌కి ఫ్లాట్ రెడీ అవుతుందమ్మా" అని చెప్పాను. "అయితే వచ్చే డిశంబర్‌లో సత్సంగాలు మీ ఇంట్లో పెడదాము" అన్నారు. శ్రీరామ్ ప్రాపర్టీస్ అంతకంటే ముందు ప్రారంభించిన అపార్ట్‌మెంట్స్‌ను రెడీ చేయటంతో మాకు ఇవ్వవలసిన అపార్ట్‌మెంట్స్ డిశంబర్‌కి కూడా రెడీ చేయలేకపోయారు.

ఈలోపున మా గృహప్రవేశ ముహుర్తం జనవరి 2013 రాత్రి 12 గం.06ని.లకు అని నిర్ణయించారు. డిశంబర్ 4,5,6 తారీకులలో సత్సంగ సమావేశాలు పెట్టాలని కూడా నిర్ణయం అయింది. నేను ఎన్నో సార్లు వెళ్ళి ఎంతగా చెప్పినా ఆ సమయానికి ఫ్లాటును తయారుచేసి ఇవ్వటం పడదని చెప్పారు. డిశంబర్ ఆఖరున వెళ్ళి బిల్డర్స్‌తో గట్టిగా చెప్పి ఏ విధంగానైనా మా ఫ్లాటుకు కావలిసిన సదుపాయాలు ఏర్పాటు చేయమని చెప్పాను. వారు చూస్తామన్నారు కాని చేస్తామని వాగ్దానం ఏదీ చేయలేదు. డిశంబర్ 25న మళ్లీ వారికి గుర్తు చేశాను. అదే పరిస్థితి. ఈ పరిస్థితులలో గృహ ప్రవేశం అనుకొన్న ముహుర్తానికి చేయటం అసాధ్యమనిపించి శ్రీ మాతాజీ వారితో మాట్లాడాను. వారు "సరే! మీరు కంగారు పడకండి. బాబూజీ నిర్ణయం ఎలా ఉంటే అలా జరుతుంది" అన్నారు. నేను మళ్ళీ బిల్డర్స్‌తో మాట్లాడాను. లిఫ్ట్ గురించి అడిగితే అది ఇప్పట్లో తయారు కాదని చెప్పారు. ముందు గుమ్మంలో తలుపులు పెట్టాలని చెప్పాను. అదీ వీలుకాదని వాళ్ళు అంటే, "తలుపులు లేకుండా

గృహ ప్రవేశం ఎలా అవుతుంది?" అని అన్నాను. వాళ్ళు తలుపులు పెట్టి ఒక లైటు పెడతామన్నారు. మెట్లకు రైలింగ్ అవసరమంటే వీలు కాదన్నారు. నీటి వసతి వీలు కాదన్నారు.

29 వతేదీన వెళ్లి చూస్తే పరిస్థితి ఇలా ఉంది – వారు తలుపులు పెట్టలేదు. లోపలికి వెళ్ళి చూస్తే గదుల మధ్యలో గుట్టలుగా మట్టి పోసి ఉంది. మెట్లనిండా రొచ్చు. నీరు ధారగా కారుతోంది. గృహ ప్రవేశ యత్నాలు ఆపి సత్సంగానికి కావలిసిన ప్రయత్నాలు చేస్తున్నాము.

జనవరి రెండవ తేదీన(2.1.2013) శ్రీ మాతాజీ వారు వచ్చారు. వారికి అప్పటి స్థితిని వివరించాము. ఫ్లాటు రెడీ కాలేదని చెప్పాము. "3 వతేదీన రెడీ చేస్తారని చెప్పారమ్మా కాని వాళ్లు చేస్తారనే నమ్మకం లేదు" అన్నాము. శ్రీ మాతాజీ " బాబూజీ నిర్ణయ ప్రకారం జరుగుతుంది" అన్నారు. జనవరి 3వ తేదీన 11 గంటలకు వెళ్ళి చూశాను. అక్కడ పెద్దగా ఏమీ పనులు జరుగుతున్నట్లు కనిపించలేదు. "మీరు 2గం. 30ని.లకు రండి. అన్నీ రెడీ చేస్తామన్నారు."

ఆశ్చర్యం! నేను వెళ్ళేసరికి ఇంట్లో సిరామిక్ టైల్స్ (ceramic tiles) వేసి, ఇల్లంతా తడి బట్టతో తుడిచారు. internal wiring .ముందే చేసి ఉంచి ప్రతి రూమ్ లో లైట్లు (lights) పెట్టారు. మెట్లు అన్నీ క్లీన్ చేసి ప్రతి అంతస్థులో లో ఒక బల్బు పెట్టారు. మెట్ల మీద రైలింగ్ కూడా పెట్టారు. ఎంట్రెన్స్ లో ఉన్న డోర్‌కి లాక్ పెట్టి ఫ్లాట్ తాళం చెవులు నాకు ఇచ్చారు. గురుదేవులు వచ్చిన తరువాత జరిగిన ఈ డెవలప్‌మెంట్‌కి ఆశ్చర్యపడ్డాను. గురుదేవులు నా పై కురిపించిన ఈ అపార కృపకు మనస్సులోనే నమోవాకాలు అర్పించుకున్నాను.

శ్రీ గురుదేవులు (శ్రీ మాతాజీ) వారు రాత్రి 10 గం. 30ని,లకు బయల్దేరి భక్తులతో సహా "నను పాలింపగ నడచి వచ్చితివా.."అన్నట్లుగా మూడవ అంతస్థ దాకా మెట్లు ఎక్కి వచ్చారు. బ్రహ్మగారైన శ్రీ కొండూరి రామ బ్రహ్మం గారు వెంట రాగా , శ్రీ మాతాజీ పాదుకలతో ముందుకు నడవగా, 12 గం.06నిలకు గృహ ప్రవేశం జరిగింది. కలశస్థాపన, విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచనం, వాస్తు పూజ శ్రీ రామబ్రహ్మంగారు జరిపించారు. అనంతరం శ్రీ సుద్గురుదేవుల పూజ శ్రీ మాతాజీ మాచేత చేయించారు. ఆ తరువాత,హెూమం చేయించారు.

ఆ మర్నాటినుంచి సత్సంగ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. శ్రీ మాతాజీవారి బోధామృతాన్ని భక్తులందరూ తనివితీరా గ్రోలారు. గురుకృప భక్తులపైన ఎలా వర్షిస్తూ ఉంటుందో శ్రీ మాతాజీ వారు మాకు ఈ విధంగా నిరూపణ చేశారు. శ్రీమాతాజీ వారు చూపిన అపార కరుణకు శ్రీ మాతాజీ వారికి నా కృతజ్ఞతాంజలులు e - mail ద్వారా తెలుపుకున్నాను.సర్వజ్ఞులు, సర్వ వ్యాపకులు అయిన శ్రీ గురుదేవులకు సాధ్యం కానిది లోకంలో ఏముంటుంది?

# ఆత్మసాక్షాత్కారమెట్లు కలుగును?

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి

పూర్వకాలంలో ఒక ధార్మికుడైన రాజుండేవాడు. విశాలమైన తన రాజప్రాసాదం యొక్క గోడ మీద మహాభారత యుద్ధ సమయంలో శ్రీకృష్ణపరమాత్మ రథంపై కూర్చుని, అర్జునకు గీతోపదేశం చేస్తున్న పవిత్ర దృశ్యాన్ని చిత్రించాలని అతనికి కోరిక కలిగింది. ఆ పని కోసం అతడు తన రాజ్యంలోని ప్రసిద్ధులైన చిత్రకారులు అందరినీ పిలిపించి, పరీక్షించి అందులో మహాప్రజ్ఞావంతులైన యిద్దరు చిత్రకారులను ఎన్నుకొన్నాడు.

వారిదిద్దరనీ తన రాజప్రాసాదంపైకి తీసుకెళ్ళి "ఓ చిత్రకారులారా! గీతపై నాకు ప్రీతి జనించినది. గీతాచిత్రాన్ని నిరంతరం నా కళ్ళెదురుగా ఉంచుకుని చూస్తూ ఆనందించాలని కోరిక కలిగింది. గీతోపదేశం చేస్తున్న సమయంలో పార్థసారథి యొక్క పావన ముఖారవిందము సదా సర్వకాలముల యందును దర్శించి కృతార్థుడను కావాలని కోరుకుంటున్నాను. కాబట్టి మీరువురును చెరియొక గోడ తీసుకుని వానిపై గీతోపదేశ చిత్తరువులను లిఖించండి. సమయం 6 మాసములు ఇవ్వబడుతుంది. ఉత్తమ చిత్రానికి బహుమానం 10వేల రూపాయలు. మీ భోజనాలను వగైరా మేమే భరిస్తాము. మీరు మాత్రం ఏకాగ్రచిత్తంతో జీవకళ ఉట్టిపడుచుండేలాగ వాటిని చిత్రించండి" అని వారితో అన్నాడు. వారు ఇద్దరూ అంగీకరించారు.

వారికివ్వబడిన గోడలు ఎదురెదురుగా ఉన్నాయి. మరుసటిరోజు నిర్ణీత సమయానికి పోటీ ప్రారంభింప బడినది. ఇద్దరూ వారివారి నైపుణ్యాన్ని చూపటానికి నిశ్చయులయ్యారు. ఒకరి చిత్రాన్ని మరొకరు కాపీ కొట్టకుండా గోడపై పెద్ద తెరలు దించబడ్డాయి. ఆ తెరల వెనకాల వారు తమ కార్యమును దీక్షతో ఉపక్రమించారు. 6నెలలు గడిచిపోయాయి. బహుమానం నిర్ణయించటానికి పెద్ద పెద్ద ప్రముఖ న్యాయ నిర్ణేతలను పిలిపించారు.

మొదటి గోడకు తగిలించిన తెర ఎత్తబడింది. చిత్తరవు కళ్ళకు కట్టినట్లు కనిపించింది. సాక్షాత్ శ్రీకృష్ణపరమాత్మయే ఆ గోడలో వెలశాడా! అన్నట్లుగా అంతటి సహజ గాంభీర్య లావణ్యాలతో తొణికిసలాడింది. ఆ చిత్రరాజము చిత్రకారుడు తన పంచప్రాణాలను దానిలో ధారపోశాడా? అనిపిస్తోంది. అది చూచి నిర్ణేతలలో చాలమంది 'ఇదే రెంటిలో ఉత్తమ చిత్రం కావచ్చు' అని మనస్సులో ఊహాగానాలు చేయసాగారు. అయినా తుది నిర్ణయం చేయటానికి రెండవది కూడా చూడాలికదా అని ఎంచి దానికి ఎదురుగా ఉన్న రెండవ గోడను సమీపించారు.

ఆ రెండవవాని పరిస్థితి ఎట్లున్నదనగా, ఆరునెలలు లక్షణముగా మూడు పూటలు రాజభోజనాన్ని ఆరగిస్తూ చిత్తరువును కొంచెం కూడా వేయకుండా ఊరికే ఉన్నాడు. అయితే ఒక గాజు పెంకును తీసుకుని మొత్తం గోడను దానితో రుద్దుతున్నాడు. ఈ ఆరు నెలలూ గోడను అదేపనిగా రుద్దగా రుద్దగా చివరకు ఆ గోడ నున్నగా అద్దంవలె తయారైంది. ఎపుంపడైతే ఆ గోడకున్న తెర తొలగించబడిందో, అప్పుడు అద్దంలా ఉన్న ఆ గోడలో ఎదుటివాడి చిత్తరువు ప్రతిబింబించింది. న్యాయనిర్ణేతలు ఆశ్చర్యపోయారు!

"ఆహా! ఎటువంటి చిత్రం లిఖించాడు! మొదటివాడు రంగులతో లిఖించాడు. ఇతడు రంగులు లేకుండానే అనేక రంగులు సృష్టించాడే! మొదటివాడు గోడపైన గీశాడు. ఇతగాడు గోడ లోపలనే గీశాడే! పైగా చిత్రం అద్దంలో వలె తళతళ మెరుస్తోందే! ఓహో! అద్భుతము! ఏమి చాకచక్యము!" అని గొప్పగా పొగుడుతూ దానిని లిఖించిన వానికే ప్రథమ బహుమతిని నిర్ణయించారు.

చూశారా! చిత్రం లిఖించకపోయినా పారితోషికము పొందగల ఘనతను అతడు ఎట్లా సంపాదించాడో! ఉన్న వస్తువును శుద్ధం చేయటమే అతడు చేసిన పని; కొత్తవస్తువును తెచ్చి చేర్చటం కాదు.

అలాగే ఆత్మ సాక్షాత్కారాని పొందగోరిన ముముక్షువు కొత్తగా ఒక వస్తువును అది దేవుడే అయినా సరే తనలో నూతనంగా తీసుకురావలసిన పని లేదు. ఆ దేవుడు తనలో సిద్ధంగా ఉన్నాడు. క్షేత్ర రూపంలో వెలసి ఉన్నాడు. అహమాత్మా గుడాకేశ! సర్వభూతాశయ స్థితః కాని జీవుని మలిన మనస్సుచేత కప్పబడి అనుభూతుడు కాకుండా ఉన్నాడు. అనేక జన్మార్జిత ఘనీభూత వాసనా జాలముచే తిరోహితుడై వర్తిస్తున్నాడు. ఎప్పుడైతే మనస్సు అభ్యాసం చేత శుద్ధం అవుతుందో, నిర్మల దర్పణంలో ప్రతిబింబం లాగా అట్టి నిర్మలాంతఃకరణలో ఆత్మ తేజస్సు లెస్సగా భాసిస్తుంది. అదియే ఆత్మసాక్షాత్కారము.

మనో నిర్మలత్వమే ఆత్మ సాక్షాత్కారానికి ఏకైక మార్గము.

*



# అపజయమే అహంకార భంగం

– స్వామిరామదాసు

ముక్కు పొడుగ్గా ఎత్తుగా ఉన్న ఒక మనిషి వెల్లకిలా పడుకుని నిద్రపోతున్నాడు. చీమలు పెద్ద సభ చేసి, నిద్రిస్తున్న వాడి ముక్కు మీదకు ప్రాకాలని నిర్ణయించటమే కాక, ముందుగా ఎక్కిన చీమకు బహుమతిని కూడా ఇవ్వాలని నిర్ణయించాయి.

చీమల్లో కూడా పర్వతారోహకులున్నాయి. అవి అయిదారు కలిసి ఆ మనిషి మీదకు ప్రాకాయి. అవి అన్ని వైపులనుంచీ ప్రాకి ఒకేసారి అతని ముక్కు వద్దకు చేరుకున్నాయి.

ఎవరు ముందు చేరారు? అనే వివాదం ఆరంభమై చీమలు కాళ్ళు చేతులూ ఆడించుకుంటూ నేను ముందు ఎక్కాను అంటే, కాదు నేనే ముందు అని అవన్నీ కలిసి దెబ్బలాడుకోసాగాయి.

ఈలోగా ఆ నిద్రపోతున్నవాడికి ముక్కుమీద దురద పెట్టి గోక్కున్నాడు. మేమంటే మేము అనుకునే చీమలగతి నేలపాలైంది. అవన్నీ చచ్చి క్రిందపడి పోయాయి.

ప్రపంచంలో అల్ప మానవులు కూడా అహంకార దర్పాలతో తాము అన్నీ సాధించగలం అనుకుంటారు. గర్వంతో ఎదుటివారికి హాని కలిగిస్తూ ఉంటారు. ఈశ్వరుడు అట్టివారిని తన శక్తితో తుడిచివేస్తాడు. అహంకారం వలన వచ్చే ముప్పు యీ కథ వలన వెల్లడి అవుతోంది.

*



దక్షసుయజ్ఞ వినాశక లింగం
కనక మహామణి భూషిత లింగం
ఫణిపతి వేష్టిత శోభిత లింగం
తత్ప్రణమామి సదాశివలింగం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

కొంత దూరం పోయాక కటిక చీకటిలో ముందు ఏముందో కనబడటం మానేసింది. వెంకన్న అలవాటుగా చీకట్లో నడిచేస్తున్నాడు. తడుముకుంటూ నడుస్తుంటే నా అడుగులు తడబడుతున్నాయి. రాధమ్మ నిర్భయంగా నడుస్తున్నది నా చేతిని వదలకుండ. వెళ్ళినకొద్దీ కొద్దికొద్దిగా వెలుగు తోస్తూ క్రమంగా పెద్దదవసాగింది. ముందు నడుస్తున్న వెంకన్న ఒకచోట ఆగాడు. మేమూ నిలబడ్డాం.



“రాధమ్మా! కృష్ణుడు ఇక్కడకి వచ్చాక మీతో చెప్పమన్నాడమ్మా! పొద్దున్న లీలమ్మని అడిగితే ముత్యాల దండ కృష్ణుణ్ణే అడగమందికదా! అలాగే అడవిలోకి పోయాక గోవులను మేపుకొని అన్నాలు తిని, చెట్లనీడన కూర్చున్నాక నాకు సందయిందని కృష్ణుణ్ణి అడిగాను. ‘గోవుల కొమ్ములకి చుట్టుకోవటానికి ఒక ముత్యాలదండ యివ్వ’మని. కిట్టయ్య చిన్నగా నవ్వుతూ ‘ఓహెూ! నీకు ఒక్కడికేనా? అందరికీ కావాలా?” అని అడిగాడు. అప్పటికే యీ విషయం అందరికీ తెలిసి ‘మాకు కూడా కావాలి’ అని గట్టిగా అరిచారు. “సరే అయితే యిక్కడున్న భూమినంతా మీ శక్తి కొలది బాగుచేయండి” అన్నాడు.

కిట్టయ్య చెప్పిన పని మాకు అర్థం కాకపోయినా చెయ్యటమే తెలుసు. అందువల్ల మేమంతా నడుం వంచి, అడవిలోని ఆ చోటంతా రాళ్ళు, పిచ్చి మొక్కలు అన్నీ ఏరేసి, బాగుచేశాము. కృష్ణయ్య పురమాయిస్తుంటే చక్కగా నది నుంచి నీళ్ళు తెచ్చి చల్లేసరికి తడిసిన మన్నంతా వెన్నలాగైంది.రాధమ్మ నడిగి ముత్యాలదండ తెమ్మనమని కిట్టయ్య నన్ను పురమాయించాడు. నేను పరుగున వచ్చి తెచ్చానుకదా. “ఇప్పుడింక విత్తనాలు చల్లాలి” అంటూ కిట్టయ్య ఆ దండలోని ముత్యాలన్నీ విడదీసి భూమి మీద చల్లాడు. ‘మా కళ్ళని మేమే నమ్మలేకపోయాము రాధమ్మా! క్షణాలలో మొక్కలు మొలచి, పెరిగి పెద్దవై, చెట్ల నిండా ముత్యాలు విరగకాసాయి.’ “ఇంకేమి చూస్తారు? అన్నీ కోసుకొని దండలు గుచ్చుకుని, మీ గోవులకు కొమ్ములకు, మెడలకు బాగా చుట్టుకోండి. ఈ ముత్యాలు ఇంత త్వరగా మొలకెత్తటానికి కారణం తెలుసా అన్నా! రాధమ్మ మనస్సనే ప్రేమ కలశంలో భక్తి రసంతో తడిసి నాని నాని మొలకెత్తటానికి సిద్ధంగా ఆమె గుండెలపై నిలిచి ఎదురు చూస్తున్నాయి రా!” అన్నాడు కన్నయ్య బలరామునితో. ఇంతవరకే చెప్పాడు వెంకన్న.

ఇప్పటికే గొప్ప బహ్మాండమైన వెలుగు నిండిన ఆ ప్రదేశంలో అన్ని ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. సందులేకుండా ఉన్నాయి ముత్యాలు నిండిన చెట్లు. కోసేవాళ్ళు కోస్తున్నారు. ముత్యాలన్నీ కుప్పలుకుప్పలుగా ఉన్నాయి. గుచ్చేవాళ్ళు గుచ్చుతున్నారు. 'గోవులన్నీ ముత్యాలదండలు అలంకరించుకుని కళకళ లాడిపోతున్నాయి' అటు చూడండి' అని అంటున్నాడు వెంకన్న వేలితో చూపిస్తూ. రాధ ముఖంలో ఆశ్చర్యం లేదు. అదంతా సహజమే అన్నట్లుగా చూస్తోంది. నాకు కళ్ళు తిరిగినట్లయింది. ఎదురుగా ఎత్తుగా ఎన్నో అంతస్తులు ఉన్న భవనం. 'రండి' అన్నాడు వెంకన్న. బొమ్మలాగా కదులుతున్నాను నేను చేష్టలుడిగినదానిలా. భవనంలోకి ప్రవేశించాము గడపలు, వాకిళ్ళు దాటి మెట్లెక్కుతున్నాము. గోడలు, మెట్లు, తలుపులు, కిటికీలు అన్నీ ముత్యాలతోనే నిర్మింపబడ్డాయి. రాధమ్మ అవలీలగా ఎక్కుతోంది. నాకు ఆయాసం వస్తోంది. ఇంత చిత్ర విచిత్ర కల్పనకి కారణభూతుడైన అసలువాడేడి! ఆత్రంగా నలువైపులా వెతుకుతున్నాను. మెల్లగా లీలగా వినబడసాగింది మురళీరవం.

అది పైకిపైకి ఎక్కిన కొద్దీ చేరువవుతోంది. నాకింక అడుగులు ముందుకు పడటం లేదు. కళ్ళు మూతలు పడుతున్నాయి. పై మెట్టు పట్టుకుని కూలబడ్డాను. అప్పుడు నా చేతుల్లోకి ఆధారమై నిలిచాయి రెండు దివ్య చరణారవిందాలు! అవి నన్నే కాదు జగత్తునంతటినీ ఉద్ధరించగలిగిన సమర్థత కలిగినవి. పరమాత్మ సన్నిధికి చేర్చిన రాధ నాకు గురుమూర్తి. ఆమె దివ్యవాణి నా శ్రవణ కుహరాలలో మారు మ్రోగుతున్నది....

***"నిరంతర తపన, అనుక్షణ హరిగుణ స్మరణ పునాదులుగా నిర్మితమైన భక్తి సౌధంలో జ్ఞాన వైరాగ్యాలనే సోపానాలనధిరోహించి, ముక్తి శిఖరాగ్రానికి చేరితే అక్కడ బ్రహ్మానంద దివ్య మణిమయ పీఠమందు విరాజిల్లుతుండే విశ్వకారణుడైన గురు ముకుందుని సాయుజ్య భాగ్యం లభిస్తుంది. ఇదంతా ముకుంద లీల!"***



# పరిప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

సద్గురుమూర్తితో కడు జాగరూకతతో సంచరించాలి. ముఖ్యంగా వారితో చేసే సంభాషణ వినయవిధేయతలతో కూడినదై ఉండాలి. కాని ఒక్కొక్క సారి శబ్ద దోషం సంభవిస్తుంది. కాని ప్రేమస్వరూపుడైన సద్గురుదేవులు శిష్యుని హెచ్చరించి, తప్పుని సరిదిద్దుకునే విధంగా బోధను అందించేవారు.



ప్రతిరోజూ ఉదయంగాని, మధ్యాహ్నంగాని, సాయంత్రంగాని సద్గురుదేవులతో సద్గోష్టి ఉండేది. దానికి ఒక నియమితమైన కాలం ఉండేదికాదు. సమయానికై ఎదురు చూడాలి. స్వాతి చినుకు కోసం ఎదురు చూసే ముత్యపు చిప్పలాగ మేమంతా ఎప్పుడు సద్గోష్టి జరుగుతుందా అని ఆవేదనతో ఎదురు చూసేవాళ్ళం. ఆ రోజు సాయం సమయం అటువంటి సదవకాశం మాకు లభించింది.

మేమంతా సద్గురుమూర్తి సన్నిధికి చేరగానే "ఉదయం నుండి ఏం చేస్తున్నారయ్యా?" అని ఒక భక్తుణ్ణి ప్రశ్నించారు బాబు. అడిగిన భక్తుడుకాక, వేరొక భక్తుడు సమాధానం చెబుతూ 'ఇంట్లోనే ఉన్నామండీ' అని సమాధానం చెప్పాడు. అది విన్న సద్గురుదేవులు "అయితే నాదే పొరపాటన్నమాట. నేనే మిమ్మల్ని సద్గోష్టికి రమ్మని పిలవవలసింది" అన్నారు.

"అంతేకాదు. ఎవరిని ప్రశ్నిస్తే వారే సమాధానం చెప్పడం నేర్చుకోండి. అడగనివారు సమాధానం చెబితే ఏమవుతుందో తెలుసా? హనుమంతుడి కథ తెలుసా! శ్రీకృష్ణపరమాత్మ అర్జునునికి రథసారధిగా ఉన్నప్పుడు యుద్ధభూమిలో భగవద్గీత బోధిస్తూ అర్జునుడిని ప్రశ్నించాడు. అర్జునుడు సమాధానం చెప్పలేదు. అర్జునుడి రథంపైన గల జండాపై కపిరాజు అంటే హనుమంతుడు దిగివచ్చి, శ్రీకృష్ణభగవానుడికి నమస్కరించి, 'ప్రభూ! మీరడిగన ప్రశ్నకు నేను సమాధానం చెప్పనా?' అని అడిగాడు. దానికి కృష్ణపరమాత్మ 'నిన్ను అడగని దానికి సమాధానం చెప్పటానికి వచ్చావు కాబట్టి ఇకముందు ఇటువంటి అవకాశం లేకుండా, మానవులెవ్వరూ నిన్ను గుర్తించకుండా, వారి ముందు పిశాచ రూపము ధరించుగాక!'అని శపించాడు శ్రీకృష్ణుడు. 'అంతేకాదు పిశాచ భాషలో భగవద్గీత రచించి, శాపగ్రస్తులైనవారు, యోగభ్రష్టులైనవారు ఎవరైనా పిశాచ జన్మఎత్తినవారు నీచేత బోధింపబడిన గీతాశ్రవణంచేసి, శాంతిని పొంది, శాప విముక్తిని పొందెదరుగాక!' అన్నారు.

"ఇది శాపమా? వరమా? చూశారా! నారాయణమూర్తి దగ్గర ఎంత వినయ విధేయతలతో ఉండాలో. అది పూర్వకాలం. ఈ రోజులలో అయితే శిష్యుడు చెప్పినట్లు గురుమూర్తి నడుచుకోవాలి. లేకపోతే శిష్యుడు సద్గురుమూర్తికి దూరం అయిపోతాడు. దాని పరవ్యవసానం వారికేం తెలుసు?" అన్నారు శ్రీబాబు.

# బాల కృష్ణుడు చేసిన తీయటి వేణుగానం

-రమణ ప్రసాద్

(ఒక ప్రసంగం)

వేణువులను అమ్మే వ్యాపారి యమునా నదీ తీరాన కూర్చుని వేణుగానం చేసుండగా బాల కృష్ణుడు అతనికి ఎదురుగా కూర్చుని తదాక ధ్యానంతో వింటుంటాడు. కనులు తెరచి చూడగానే ఎదురుగా ఉన్న కన్నయ్యను చూసి -

వేణువుల వ్యాపారి (వే.వ్యా) - బుజ్జి కన్నయ్యా నువ్వా? ఎప్పటినుంచి ఇక్కడ కూర్చుని ఉన్నావు?

బాల కృష్ణుడు (బా.కృ) - అవును. నేనే. చాలాసేపటినుంచీ నీ మురళి గానాన్ని వింటున్నాను. నువ్వు అద్భుతంగా వాయిస్తున్నావు. ఈ మురళి ఎలా మట్లాడుతుంది?

వే.వ్యా - మురళి మాట్లాడదు. దానిని వాయించాలి.

బా.కృ - ఇప్పుడు నువ్వు ఏం వాయిస్తున్నావు?

వే.వ్యా - ఇప్పుడు నేను వాయించే రాగం భైరవిరాగం.

బా.కృ - నేనూ వాయిస్తాను. (అని మురళీ తీసుకోవటానికి ప్రయత్నిస్తాడు)

వే.వ్యా - ఇది పెద్ద మురళి. నీకు చిన్న మురళి ఇస్తాను. ఇది నీ చేతులతో నాకు మొదటి బోణీ.

బా.కృ - ఏదీ. ఆ రాగం వినిపించు.

వే.వ్యా - సా.రె.గ మ.ప.ధ.ని సా ( అని ఆలాపన చేస్తాడు)

బా.కృ - ఇందులోనూ ఆ రాగం పలుకుతుందా?

వే.వ్యా - తప్పకుండా పలుకుతుంది. కాని అభ్యాసం చేయాలి నువ్వు

బా.కృ - (మురళిని చేతిలో తీసుకొని) నోటితో సా.రె.గ. మ.ప.ధ.ని సా అని అంటాడు.

వే.వ్యా - అలా కాదు. దీనిని నోటి దగ్గర పెట్టుకుని దీనిలోకి గాలిని ఊదాలి.

బా.కృ - (తను ప్రయత్నం చేసి విఫలుడై) నాకు ఇది మ్రోగడంలేదు. దీనితో చెప్పు మ్రోగమని.

వే.వ్యా - ముందుగా చేతులు జోడించి సరస్వతీ మాతను ఈ విధంగా ప్రారంభించాలి. "హే సరస్వతీ మాతా! నువ్వు నా వేణువులో సంగీత స్వరాలను నింపు" అని ప్రార్థించాలి. ఏదీ అలా ప్రార్థించు.

బా.కృ - హే సరస్వతీ మాతా!

సరస్వతి - ఆజ్ఞ ప్రభూ!

బా.కృ - నువ్వు నా వేణువులో సంగీత స్వరాలను నింపు.

సరస్వతి - తథాస్తు!

అప్పుడు బాల కృష్ణుడు మురళిని తన నోటి దగ్గర పెట్టుకొని మురళీ గానం

చేశాడు. ఆ గానానికి యమునా నది పులకించింది. నెమళ్ళు నాట్యం చేశాయి. సరస్వతీ దేవి నమస్కరించింది. దేవతలలు పుష్ప వర్షం కురిపించారు. వేణువుల వ్యాపారి బాల కృష్ణుడి పాదాలపై వ్రాలిపోయాడు.



## జనక – సులభ సంవాదం

సులభ – జనకుడా! నువ్వు జ్ఞానివా?

జనకుడు – అవును

సులభ – అయితే నీకు భేద దర్శనం లేదుగదా? నీ భార్యను చూసినట్లు నన్నెందుకు చూడవు?

జనకుడు – సులభా! నువ్వు జ్ఞానివా? అజ్ఞానివా?

సులభ – నేను జ్ఞానినే.

జనకుడు – నువ్వు జ్ఞానివైతే నువ్వు స్త్రీవని, నేను పురుషుడనని నీకు భేద దర్శనం ఎలా కలిగింది?

సులభ మౌనంగా వెళ్ళిపోయింది.

# స్థిత ప్రజ్ఞుడు

- పరాశర ప్రసాద్

అద్దంలో సూర్యబింబం దర్శించటం సూర్యకాంతి వలనే సాధ్యపడుతుంది. అలాగే ఇంద్రియాల ద్వారా మనస్సు ద్వారా పొందే ఆనందానికి ఆధారం ఆత్మవస్తువే కదా! ప్రపంచంలో వస్తువుల ద్వారా పొందే ఆనందానికి తరతమ భేదాలు తప్పవు. అంతేకాదు ప్రాపంచిక ఆనందం ప్రియము, మోదము, ప్రమోదము అని మూడు రకాలు. ఆత్మానందానికి తరతమ భేదాలు లేవు. అది సహజమైనది, నిత్యమైనది,సత్యమైనది, శాశ్వతమైనది.

స్థితప్రజ్ఞుడు దుఃఖానికి బాధపడడు. సుఖాన్ని అనుభవించడు. మనస్సు లేనివాడికి సుఖమూ లేదు, దుఃఖమూ లేదు. పుణ్యఫలము సుఖము, పాప ఫలము దుఃఖము. సద్గురుమూర్తిని ఆశ్రయించిన భక్తుడు సుఖము కలిగితే పుణ్యం ఖర్చు అయిపోతుందని బాధపడతాడు. అదే దుఃఖము కలిగితే పాపం తరిగిపోతోందని సంతోషిస్తాడు. జాగ్రదావస్థలో వచ్చి సుషుప్తిలో అదృశ్యమైపోయేది ఏదైనా అనిత్యమైనదే. వచ్చిపోయేది ఏదైనా సరే అనిత్యమైనదే.

స్థితప్రజ్ఞుడు సుఖదుఃఖాలకు ఆధారము 'నేను' అని గుర్తిస్తాడు.శరీరం ఉన్నంతవరకు ప్రారబ్దము, మనస్సు ఉన్నంతవరకు సుఖదుఃఖాలు, ప్రపంచం ఉన్నంత వరకు రాత్రింబవళ్ళు తప్పవు అన్న సత్యాన్ని గుర్తించినవాడే స్థితప్రజ్ఞుడు.

రాగము, భయము, క్రోధము ఈ మూడిటికి మూలము కామము. కామము అనుకూలిస్తే రాగము కలుగుతుంది. ప్రతికూలిస్తే భయము, క్రోధము కలుగుతాయి. అవిద్య, అవివేకం, భయం, రాగం, ద్వేషం అనేవి పంచక్లేశాలు. ఇవి జీవ లక్షణాలు. అంతేకాదు ఇవన్నీ అజ్ఞానానికి సంకేతాలు.

విషపురుగులు చీకటిలోనే సంచరిస్తాయి. వెలుగులో అవి తోకముడుస్తాయి. స్థితప్రజ్ఞునికి జ్ఞాన తేజస్సులో పంచక్లేశాలకి తావులేదు. ఆయన సదా తన రూపాన్ని మననం చేస్తాడు. అందువలనే ఆయన ముని. మానవులలో అనేక రకాలవాళ్ళుంటారు. అశుభాన్ని కోరుకునేవారు, శుభాన్ని, అశుభాన్ని రెంటినీ కోరుకునేవారు, శుభాన్ని మాత్రమే కోరుకునేవారు, రెంటినీ త్యజించేవారు అని నాలుగు రకాలవారు. వీరందరితో సంచరించినా అతీతంగా ఉండేవాడే స్థితప్రజ్ఞుడు.

వారికి ప్రేమ ఉంటుందికాని మమకారం ఉండదు. మమకారం స్వార్థపూరిత మైనది. కామం ముసుగుతో కూడినది నిజమైన ప్రేమకాదు. సత్యమైన ప్రేమలో బంధన ఉండదు. హాస్పిటల్‌లో నర్సు పిల్లల్ని ప్రేమిస్తుంది, చక్కగా చూస్తుంది, సేవచేస్తుంది కాని ఆ పిల్ల మృతిచెందితే దుఃఖించదు. కాని తల్లి దుఃఖిస్తుంది. తల్లిది మమకారం.

నర్సుది ప్రేమ. కారు డ్రైవరు ఉంటాడు. కారుని చాల జాగ్రత్తగా చూసుకుంటాడు. ఎవరినీ తాకనివ్వడు. కాని ప్రమాదవశాత్తు దానికి ఏదైనా దెబ్బతగిలితే బాధపడడు. కాని కారు యజమాని బాధపడతాడు. అలాగే ప్రపంచంలో సంచరించటంలో తప్పు లేదు. ఎంతవరకు వ్యవహారంలో మనస్సును ఉంచాలో అంతవరకే. అంతేకాని హద్దుదాటి పోకూడదు. పదార్థాలలో రుచి ఎంతవరకు అవసరమో అంతవరకే కాని ఎక్కువ వేయరు కదా!

స్థితప్రజ్ఞుడు సంఘంలో ఉన్నా నిస్సంగుడే. శబ్ద స్పర్శ రూప రస గంధాల ద్వారా ఇంద్రియాలు మైల పదార్థాలని సేకరించి, అంతఃకరణ మీద తమ ప్రభావాన్ని చూపుతాయి. అందువలనే సద్గురుమూర్తి బ్రహ్మోపదేశం చేసే ముందు ఆశ్రమ సేవ చేయమని ఆదేశిస్తారు. ఆశ్రమసేవ ద్వారా అంతఃకరణ శుద్ధి చెందిన తరువాత ఉపదేశానికి అర్హుడౌతాడు.

ఒక గురువుగారు తమ శిష్యుడిని పేడ తట్టతో నీళ్ళు తెచ్చి మొక్కలకి పోయమన్నారు. పేడతట్టతో ఎన్నిసార్లు తెచ్చినా నీళ్ళు తట్టలో నిలవటం లేదు. మొక్కలకి నీరు అందటం లేదు. విసుగు వచ్చి 41రోజులు తరువాత ఆ శిష్యుడు వెళ్ళిపోవటానికి నిర్ణయించుకున్నాడు. గురువుగారు చూసి శిష్యుడిని పిలిచి, 'చూశావా? ఈ మండల దీక్షలో ఈ పేడ తట్టలో మురికిపోయి శుభ్రపడింది. అలాగే నీ ఇంద్రియాలలో చేరిన మలినాన్ని వదిలించాలి. అది తెలియజేయటానికే ఈ దీక్ష' అన్నారు.

- సశేషం

**శ్రీసద్గురు ప్రసాదిత (50వ,) సర్ణోత్సవ శ్రీరాధాకృష్ణ జన్మాష్టమి మహోత్సవములు**
**శ్రీ సద్గురు భాగవత, అఖండనామ సప్తాహ, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళన**
**సర్ణోత్సవ కార్యక్రమాలు**

*స్వస్తి శ్రీ చాంద్రమాన శ్రీ విజయనామ సంవత్సర శ్రావణ బహుళ సప్తమి అనగా ది.27-8-2013 మంగళవారం నుండి 2-9-2013 సోమవారం వరకు సప్తాహ దీక్షతో శ్రీకాశీవనాశ్రమము నందు పూజా కార్యక్రమములు జరుపబడును. కావున ఏవన్మంది భక్తులు కార్యక్రమములో పాల్గొని తరించవలసినదిగా కోరుతున్నాము.*

<u>కార్యక్రమములు</u>

సప్తాహ్నిక శ్రీకృష్ణ మూలమంత్ర హెూమము, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము, అఖండ సప్తాహ్నిక హరేరామ నామము, భాగవత ప్రవచనము, భగవద్గీతా పారాయణ ,మాతాజీవారిచే దివ్య అనుగ్రహ భాషణ ఉంటాయి.

2-9-2013న పూర్ణాహుతి, శ్రీరాధాకృష్ణుల సహస్రనామపూజ, శ్రీసద్గురుపాదపూజ జరుగును.

# విశ్వాసమే భక్తి

-కృష్ణ లాల్

పరమాత్ముని సాకార బ్రహ్మగా దర్శించగల మానవులు సమస్త జీవరాసులలో కెల్ల ఉత్తములు. మానవులు భక్తి ద్వారా పరమాత్ముని దర్శించి ఆనందాన్ని పొందుతున్నారు. అయితే ఈ భక్తి ద్వారా మోక్షప్రాప్తి కలుగుతుందా? భక్తి పరాకాష్ఠయే జ్ఞానం. జ్ఞానం పరాకాష్ఠయే మోక్ష స్థితి. ఈ స్థితిలో జీవబంధం ఉండదు. సగుణారాధన ఎంతవరకు మానవుడు చేయాలి? దీనికి మన శాస్త్రాలు ఏమి చెబుతున్నాయి?



మనం ఒక పిల్లవాడికి అక్షరాభ్యాసం చేసేటప్పుడు గురుదేవుని దగ్గరకు తీసుకువెళ్ళి, ఒక పలక బలపం తెచ్చి అక్షరాన్ని దిద్దిస్తాము. ఆ పలక బలపం ఎంతవరకు అవసరం? ఆ అక్షర స్వరూపుడు తానయ్యేవరకు మాత్రమే. అక్షర స్వరూపుడు తానైన తరువాత కొత్త అక్షరాలు, పదాలు ఎన్ని నేర్చుకున్నా, నీలోని అక్షరం తగ్గటంకాని, పెరగటం కాని జరగదు. అయితే ఆ అక్షరాలని చూడటం సాధ్యమా? మానవుని శరీరాన్ని చీల్చి చూస్తే పేగులు, రక్తం కనిపిస్తాయి. కాని అక్షరాలు కనబడవు. అలాగని అక్షరం లేదని చెప్పగలవా?

సగుణంగా ఉన్నప్పుడు నేను వేరు, పరమాత్మవేరు అనే ద్వైత భావన ఉంటుంది. ఆ భావనను తుడిచివేసి తానే మానవులకు చెడు చెయ్యడు. నేను పరమాత్మునికి సేవ చేస్తున్నాను అనే స్థితికి వస్తారు. కారణం ఆ పరమాత్ముని కమనీయ ఆకృతి మన మనస్సులో నిలిచిపోవటమే. ఆ దివ్యనామం జపించటం వలన హృదయం కలుషరహితమై నీచప్రవృత్తి పవిత్ర ప్రవృత్తిగా మారుతుంది. మానవుడు ధ్యానాగ్నిచేత శుద్ధి చెంది సత్యత్వాన్ని పొందుతాడు. మానవుడే మాధవుడవుతాడు. అటువంటి మహాత్ములను, గీతాచార్యుని విడదీయుటకు వీలులేదు. దీపాన్ని కాంతి నుండి విడదీయ గలమా? అట్టి జ్ఞాన హృదయం కల్గిన మహాత్ముల మనస్సు విషయాదుల మీదకు పోదు. పాల నుండి వేరు చేసిన వెన్న తిరిగి పాలలో కలుస్తుందా?

మనకు సత్యగురుదేవులు లభించినప్పుడు మాత్రమే అట్టి స్థితిని పొంద గలుగుతాము. గురునానక్, తుకారాం, త్యాగయ్య, రామదాస్, బుద్ధుడు, సక్కుబాయి, మీరా వంటి సత్యగురువులు లభించాలిగాని, 'చేతిలో రూపాయి చెవిలో మంత్రం' గురువులు కాదు.

మన శరీరంలో బాధలు ఎలా అనుభవిస్తామో, అదే విధంగా ఆత్మానుభూతిని అనుభవించాలిగాని చచ్చిన తరువాత సాధించే మోక్షం ఏముంది? ఎత్తిపోతలు

మాత్రమే. అర్థం తెలియని శ్లోకాలు, పవిత్ర గ్రంథాలు చదివినందువల్ల ఏం లాభం? రామ నామంలోని రెండు అక్షరాలలో ఏకత్వం సాధించి తదాకారాన్ని పొందు. సకల శాస్త్రాలలోని సారం దీనిలోనే ఉంది. రామనామంలోని 'రా' అనే అక్షరం అహంకారాన్ని, 'మ' అనే అక్షరం మమకారాన్ని హరిస్తుంది.

పరమాత్మని ప్రార్థించినట్లయితే జననమరణ మృత్యుకూపం నుండి రక్షిస్తాడు అనే విశ్వాసం ఉంటుంది. ఆ ప్రభువు దివ్యచరణాలు నన్ను రక్షిస్తాయి. ఆ దివ్యనామం నన్ను రక్షిస్తుంది అనే ప్రగాఢ విశ్వాసం భగవంతుని యందు ఉంచటమే భక్తి. భగవంతుని యందు విశ్వాసము పెంపొందించుకొంటే చాలు. ఏ పూజలు చేయనవసరం లేదు. 'నేను ఉన్నాను అని విశ్వసించు చాలు' అదే భగవద్వాణి.

భగవానుడు వైకుంఠంలో ఉన్నాడు. మనం ఈ భూలోకంలో ఉన్నాము. ఆయన ఇక్కడకు వచ్చి ఎలా రక్షిస్తాడు? ఈ భవనంలో యిన్ని లైట్లు వెలుగుతున్నాయి కదా. మెయిన్ స్విచ్ ఆపివేస్తే యీ లైట్లన్నీ ఆరిపోతాయి. అలాగే ఇంద్రియాలన్నిటికి మనస్సు మెయిన్ స్విచ్. ఆ మనస్సు అచంచల భక్తితో దివ్యత్వాన్ని ప్రసాదించే పరమాత్ముని పాదపద్మాల యందు ఎప్పుడైతే నిలుస్తుందో అప్పుడు జన్మజన్మల వాసనలు, దుష్టసంకల్పాలు హరించిపోయి తదాకారాన్ని పొందుతుంది. శాశ్వతమైన ప్రజ్ఞాన పరబ్రహ్మ వస్తువు తానే అని తెలుసుకుంటాడు మానవుడు. ఇట్టి దివ్యజ్ఞానం ద్వారా వైకుంఠ వాసుడు తన హృదయంలోనే ఉన్నాడు అని తెలుసుకుంటాడు.

తెల్లవారుజామున లేచి 'ఓం శ్రీరామ జయరామ జయజయరామ' అని కాని లేదా 'ఓం శ్రీం రాం' అని కాని ధ్యానం చేసి మనస్సుని భగవానుని యందు నిలపండి. మీకు భగవంతుడికి అడ్డుగా ఉన్న దుష్టశక్తులు హరించి ఆనందం లభిస్తుంది. ఎంత ధనవంతుడైనా ఆశని జయిస్తేనే ఆనందం. ఆశ లేకపోతే ప్రపంచం ఏముంది? భగవానుని చరణారవిందాలు నమ్ముకున్న వానికి ఐశ్వర్యానికి లోటు ఏముంది? అందువలనే భగవద్గీతలో 'నీ మనస్సు నా యందు ఉంచి. నన్నే విశ్వసించు. నన్నే ధ్యానించు. సర్వమూ నేనే చూసుకుంటాను' అన్నాడు భగవానుడు. భగవంతుణ్ణి నమ్మండి చాలు.

మనం విషయాదులను ప్రేమించిన దానిలో వెయ్యోవంతు భగవంతుణ్ణి ప్రేమిస్తే చాలు. సర్వమూ ప్రసాదిస్తాడు. ప్రేమయే పరమాత్మ. గాఢమైన విశ్వాసమే భక్తి. అట్టి భగవానుడు అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి సర్వదా రక్షించు గాక! సుఖీభవ! సుఖీభవ!!



# భగవంతుని ఆశీర్వదించిన ఆళ్వారు

- సుషుమ్న ప్రసాద

శ్రీకృష్ణపరమాత్మ, బలరాముడు బృందావనం నుండి మధురకు వెడుతున్న సమయంలో సుదాముడనే మాలాకారుడిని చూడటం తటస్థించింది. సుదాముడు బాలకృష్ణుని దివ్యసౌందర్యాన్ని చూసి, ముగ్ధుడవుతుండగా కృష్ణుడు సరదాగా ఒక పూలదండ తీసుకున్నాడు. కృష్ణుడు సుదాముడికి ఒక వరాన్ని యిస్తానన్నాడు. ఆనందంతో ఉప్పొంగిపోతూ సుదాముడు "ప్రభూ!నీ పరమానుగ్రహానికి పాత్రుడనైన నాకు వేరే కావల్సినదేముంది? మీరు నాకు వరాన్ని ప్రసాదించాలనుకుంటే కనుక నీ పాద కమలసేవయు, నీ పాదార్చకులతోడి నెయ్యమును, నితాంత అపార భూతదయయును తాపస మందార నాకు దయసేయగదే!" అని ప్రార్థించాడు.

భాగవతములోని యీ సుదాముని వృత్తాంతముతో విష్ణుచిత్తుని చిత్తము ఉప్పొంగింది. విష్ణుచిత్తుడు తమిళనాడులోని మదురైకి సమీపంలో ఉన్న శ్రీవిల్లిపుత్తూరు క్షేత్రంలో శ్రీవటపత్రశాయి దేవాలయములో పుష్పకైంకర్యం చేసేవాడు. ఆ మహాభక్తుడు సుదాముని ఆదర్శంగా తీసుకున్నాడు.

ఒకరోజు ఒక యాత్రీకుడు శ్రీవిల్లిపుత్తూరు వచ్చి, విష్ణుచిత్తుని గృహంలో విశ్రాంతి తీసుకొన్నాడు. విష్ణుచిత్తునితో సంభాషిస్తూ యిలా అన్నాడు " మానవుడి కర్తవ్యం ఏమిటి?" విష్ణుచిత్తుడు సమాధానం చెబుతూ "సంవత్సరంలో ఎనిమిది నెలలు కష్టపడితే, వర్షఋతువులో నాలుగు నెలలు యింటివద్ద సుఖపడవచ్చు. రాత్రి విశ్రాంతి తీసుకోవాలంటే, పగలంతా పని చేయాలి. యుక్తవయస్సులో ఉన్నప్పుడు వృద్ధాప్యం సుఖమయం చేసుకోవటానికి కష్టపడి పనిచేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా ఇహంలో చేసే పారమార్థిక కృషి , పరంలో నిత్యానందాన్ని ప్రసాదిస్తుంది.

పాండ్యరాజు ప్రజలవద్దకు ప్రజలనాడిని తెలుసుకోవటానికి మారువేషంలో వస్తూ, విష్ణుచిత్తుని దగ్గరకు వచ్చి యాత్రుకునిరూపంలో ఈ విధంగా ప్రశ్నించి ఆయన వద్ద సమాధానం పొందాడు. మరునాడు ఉదయమే రాజుగారు తన రాజధానికి బయలుదేరి వెళ్ళి, తన మంత్రిని పిలిపించి, "పరం కోసం, ఇహంలో ఏమి చేయాలి?" అని అడిగాడు. దానికి మంత్రి యిలా సమాధానం చెప్పాడు "మహారాజా! పండితులందరినీ సమావేశపరచి, యీ విషయం చర్చిస్తే బాగుంటుంది" అన్నాడు.

మరునాడు మహారాజు యీ విషయంపై చర్చలు జరపటానికి పండితులను పిలిపించి, సరియైన సమాధానం చెప్పినవారికి బంగారుమాలను బహుమానంగా ప్రకటించాడు. ఈ సమావేశానికి సన్నాహాలు జరుగుతుండగా, మహారాణికి

శ్రీమన్నారాయణుడు స్వప్నంలో దర్శనమిచ్చి, "విల్లిపుత్తూరులో ఉన్న శ్రీ విష్ణుచిత్తుని తగు మర్యాదలతో యీ సభకు ఆహ్వానించవలసింది" అని ఆదేశించాడు.

అక్కడ విష్ణుచిత్తునకు కూడా కలలో దర్శనమిచ్చి "మదురైలో జరిగే పండిత సభకు వెళ్ళి పరమాత్మ తత్వమును నిరూపించు" అన్నాడు. విష్ణుచిత్తుడు కలత చెంది ప్రభువుతో యిలా విన్నవించుకున్నాడు "ప్రభూ! నేను ఆధ్యాత్మ విషయంలో నిష్ణాతుడైన పండితుని కాదు. నేను కేవలం నీ భక్తుణ్ణి మాత్రమే. ఆ పండిత చర్చలలో, పండిత దిగ్గజాలను ఎలా ఎదుర్కొనగలను?" అని వేడుకున్నాడు. కానీ పరమాత్మ "నీవీ చర్చలో తప్పక పాల్గొని విజయాన్ని సాధించాలి" అని ఆదేశించాడు. మరునాడు ఉదయమే విష్ణుచిత్తుని సభకు తీసుకువెళ్ళటానికి రాచపల్లకి వచ్చింది. ఆ భక్తుడు ఏమి జరగనున్నదో అని వణికిపోతూ ఆ పల్లకీ ఎక్కి కూర్చున్నాడు.

రాజ ప్రాసాదంలో పండితసభలో 'పరంలో సుఖం కోసం ఇహంలో కర్తవ్యం' గూర్చి ఒక పండితుని తరువాత మరొక పండితుడు చొప్పున దీర్ఘంగా చర్చించారు. కానీ రాజుగారికి వారెవరి సిద్ధాంతము తృప్తిని కలిగించలేదు. ఎందుకంటే వారి మాటలో అనుభవ జ్ఞానం కంటే పాండిత్యమే ఎక్కువగా కనిపించింది. చివరికి విష్ణుచిత్తుడి వంతు వచ్చింది.

ఆయన లేచి నారాయణుని ధ్యానించి నెమ్మదిగా చెప్పడం ప్రారంభించాడు. ఆయన ఉపన్యాసంలో వేదాలు, ఉపనిషత్తులు, ఆధ్యాత్మిక గ్రంథాలలోని విషయాలు, అతి మామూలు పదాలతో ఉదహరిస్తూ ఒక అద్భుతమైన ప్రవాహం లాగా సాగింది. పండితులంతా ఆశ్చర్యపోయారు. ఆయన చెబుతూ "నీవు శ్రీమన్నారాయణుని సంపూర్ణంగా శరణు పొంది, ఈ జన్మలో నిరంతరమూ ప్రార్థిస్తే, పరం తానే జాగ్రత పడుతుంది." వెంటనే స్తంభానికి కట్టిన ఒక బంగారు నాణముల గొలుసు దానంతట అది విష్ణుచిత్తుని హస్తాలలో పడింది.

శ్రీవల్లభమహారాజు విష్ణుచిత్తుని ముగింపుతో చాలా సంతోషపడి, సరియైన సలహా యిచ్చినందుకు కృతజ్ఞతా భావాన్ని ప్రకటించి, 'భట్టార్ పిరాన్' (విద్వాంసులకు నాయకుడు) అనే బిరుదును ప్రదానం చేసి సత్కరించారు. తరువాత ఎంతో అందంగా అలంకరించిన ఏనుగుపై నెక్కించి, నగరంలోని ప్రధాన వీధులలో ఊరేగింపుగా వెడుతుండగా ప్రజలు ముక్తకంఠంతో 'భట్టారుపిరాన్ చిరకాలం జీవించుగాక!' అని ఎలుగెత్తి చాటారు. ఈ ఊరేగింపు కూడల్ అజ్‌గార్ (కూడల్ అనేది మదురైకి మరొక పేరు) దేవాలయము వద్ద ముగిసింది.

– సశేషం

# అజ్ఞానం

– కె. పద్మ

అశోకుడు బౌద్ధ భిక్షువుల యెడల అమితమైన గౌరవాన్ని, ఆదరాన్ని చూపేవాడు. తన వద్దకు వచ్చిన ప్రతి బౌద్ధ సన్యాసి ముందు ఆయన తల వంచి నమస్కారం చేసేవాడు.

అశోకుని మంత్రులలో యశుడు అనే మంత్రికి అశోకుడు ఇలా బౌద్ధ సన్యాసుల ముందు తలవంచి నమస్కరించడం యిష్టం ఉండేది కాదు. ఉన్నత వంశానికి చెందిన చక్రవర్తి, అతి సామాన్యుడైన బౌద్ధభిక్షువు ముందు తలవంచటమేమిటి అని అతని అభిప్రాయం.

యశుడు తన అభిప్రాయాన్ని అశోకునితో చెప్పాడు. ఆయన మంత్రి చెప్పినది విని మౌనంగా ఊరుకున్నాడు. ఆరోజంతా తీవ్రంగా ఆలోచించాడు చక్రవర్తి. యశుని అజ్ఞానాన్ని తొలగించటానికి ఆయనకి చక్కని ఉపాయం దొరికింది.

అశోకుడు తన మంత్రులందరినీ పిలిచి పెద్దబజారులో జంతువుల శిరస్సులను అమ్మాలి. ఒక్క యశుడు మాత్రం మనిషి శిరస్సును అమ్మాలి అని ఒక ఉత్తరువును జారీచేశాడు.

అశోకుని ఆజ్ఞ మంత్రులందరికీ తీవ్ర ఆగ్రహాన్నీ, అసంతృప్తినీ కలిగించింది. చక్రవర్తి ఆజ్ఞ కాబట్టి వేరే గత్యంతరం లేక యశుడు మనిషి తలను తీసుకుని, మిగతా మంత్రులు జంతువుల తలలను తీసుకుని విక్రయించటానికి బజారుకు వెళ్ళారు.

యశుడు తప్ప తత్తిమా మంత్రులందరూ తమ అమ్మకాలను త్వరగా పూర్తి చేశారు. యశుడు ఎంత ప్రయత్నించినా మనిషి తలను ఎవ్వరికీ అమ్మలేకపోయాడు. చివరికి అనేకమందికి ఉచితంగా యివ్వడానికి ప్రయత్నం చేసినా కూడా వృధా అయింది. ఎవరూ మనిషి తలను తీసుకోవడానికి యిష్టపడలేదు.

ఇచ్చిన గడువు పూర్తి అయినతరువాత మంత్రులందరినీ తన దగ్గరకి పిలిపించాడు చక్రవర్తి. మిగతా మంత్రులందరూ ఉత్సాహంతో సభకి వచ్చారు. ఒక్క యశుడు మాత్రం సిగ్గుతో తలవంచుకుని వచ్చాడు. తాను ఎంత ప్రయత్నించినా మానవ శిరస్సును అమ్మలేక పోయానని బాధగా చెప్పుకున్నాడు చక్రవర్తితో. 'ఎందువలన అమ్మలేకపోయావా శిరస్సును?' అని అడిగాడు చక్రవర్తి.

"ప్రజలెవరూ ఆ శిరస్సును కొనడానికి యిష్టపడలేదు ప్రభూ! చివరకు ఉచితంగా కూడా తీసుకోవడానికి అంగీకరించలేదెవరూ" అన్నాడు.

"ఆ తల ఒక సాధారణ మనిషిది అవటం వలన ఎవరూ కొనలేదనా నీ ఉద్దేశం?' అని అడిగాడు చక్రవర్తి.

"లేదు ప్రభూ! నా ఉద్దేశం అది కాదు" అన్నాడు యశుడు.

"పోనీ నా తల అయితే ఎవరైనా కొంటారా?" అన్నాడు అశోకుడు.

అది విని నోట మాటరాక నిలబడిపోయాడు యశుడు. భయంతో గణగణ వణికిపోయాడు. ఏం సమాధానం చెబితే చక్రవర్తికి ఏం కోపం వస్తుందోనని భయపడ్డాడు.

అది గ్రహించిన అశోకుడు అతనికి ధైర్యం చెబుతూ "యశా! నువ్వు ఎటువంటి సమాధానం చెప్పినా నీకు ఏ ఇబ్బందీ కలగకుండా నేను చూసుకుంటాను" అన్నాడు.

"ప్రభూ! సామాన్యుడి తల అయినా, చక్రవర్తి తల అయినా ప్రజలు కొనరని నా ఉద్దేశం. నేను అమ్మజూపింది ఒక మనిషి తల కాబట్టి వాళ్ళు ఉచితంగా కూడా తీసుకోవటం లేదు. ఒక మనిషి, సాటిమనిషి తల కొనడం అసంభవం." అన్నాడు.

అశోకుడు మాట్లాడుతూ "నువ్వు చెప్పిందానికి నేను అంగీకరిస్తున్నాను. సామాన్యుడి శిరస్సుకూ, చక్రవర్తి శిరస్సుకూ తేడా ఉందని ఎవరూ అనరు. రెండు శిరస్సుల మధ్య తేడా లేదు. అటువంటప్పుడు నువ్వు నేను బౌద్ధ భిక్షువుల ముందు తల వంచి నమస్కరిస్తే నువ్వు అభ్యంతరం ఎందుకు చెప్పావు? భిక్షువుల యొక్క సత్ప్రర్తన, విజ్ఞానం, త్యాగనిరతి చూసి నేను వారికి తల వంచి నమస్కరిస్తున్నాను.

ఒక మనిషి పెద్ద పదవులో ఉన్నంత మాత్రాన ఉన్నతుడు కాదు. సత్ప్రవర్తన, విజ్ఞానం, అతణ్ణి ఉన్నత స్థానంలో ఉంచుతుంది. పైకి అసహ్యంగా, సామాన్యుడిగా కనిపించే వ్యక్తిలో అద్భుతమైన ప్రతిభ ఉండి ఉండవచ్చు.

నీవు నీ అజ్ఞానం నుండి బయట పడిననాడు, అసంఖ్యాకమైన మానవ సమూహంలో నుంచి, స్వల్ప సంఖ్యలో ఉండే ఉన్నతులైన మానవులను గుర్తించ గలుగుతావు. విలువలేని రాళ్ళ మధ్యలో నుండి విలువైన వజ్రాన్ని వెలికితీసే నిపుణుడు లాగ" అన్నాడు అశోక చక్రవర్తి.

చక్రవర్తి చెప్పింది విని, యశుడు తనలోని అజ్ఞానాన్ని గుర్తించి, చక్రవర్తికి తలవంచి మనస్సులోనే జోహారులర్పించాడు.



# చందాదారులకు విజ్ఞప్తి

చందాదారులు కొంతమంది 'సమర్థసద్గురు మాసపత్రిక' తమకు చేరటం లేదని మాకు ఫోన్ చేస్తున్నారు. మేము పత్రిక డిశ్పాచ్ చేసేవరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. జిల్లావారీగా సార్టింగ్, కౌంటింగ్ చేసి ఇక్కడ గుంటూరు ఆర్.ఎమ్.ఎస్ వారి దగ్గరకు చేరుస్తున్నాము. మాసపత్రిక చదవాలనే మీ ఆసక్తికి ఆనందము, పుస్తకము చేరటంలేదని విచారము కలుగుతున్నవి. గుంటూరు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వారిని సంప్రదిస్తే వారు 'చందాదారులనుండి మాకు కంప్లయింట్ అందితే మేము ఇన్‌స్పెక్టర్‌ను పంపి తప్పక చర్య తీసుకోగలము' అన్నారు. కావున చందాదారులు మాకు అందలేదని ఫోన్‌చేస్తే మేము మరొక పుస్తకము మీకు పంపగలము. కానీ పత్రిక మీకు సక్రమంగా చేరాలంటే మీరు వెంటనే మాకు కంప్లయింట్ ఈ క్రింది విధంగా రాసి పంపగలరు............

సమర్థ సద్గురు తెలుగుమాసపత్రిక యాజమాన్యం వారికి -

నేను .........**AS NO..,..** లేదా **LM NO.** .......... గల చందాదారుడను. ........ నెల పత్రిక మాకు అందలేదు. కారణము తెలియదు. ఇక్కడ మా పోస్ట్‌మాన్ ..........పోస్ట్‌మాస్టర్ ........ పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్ .........వారిని సంప్రదించగా మాకు ఈ క్రింది విధంగా సమాధానం చెప్పినారు..... ....... మాకు మిగిలిన ఉత్తరములు సక్రమముగానే అందుచున్నవి. కావున గుంటూరు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వారికి ఫిర్యాదు చేయవలసినదిగా కోరుచున్నాము.

నా అడ్రస్ పూర్తి వివరములతో.............

పేరు ........ **AS NO** లేదా **LM NO.........**

ఇంటి నెం........ వీధి పేరు......... గ్రామం పేరు...... జిల్లా......

పిన్ కోడ్ నెం........ ఫోన్ నెం. సెల్...... లాండ్‌లైన్ నెం............

## గమనిక

మీ సభ్యత్వం ఏ తేదీ వరకు ఉన్నదో తెలియజేస్తూ సమర్థ సద్గురు పత్రిక కవర్ మీద వ్రాస్తున్నాము. దానిని గమనించి మీరు సకాలంలో మీ మెంబర్‌షిప్‌ను రెన్యూ చేసుకున్న యెడల మీకు నిరాటంకంగా పత్రికను పంపగలము. చందాను ఈ క్రింది ఎడ్రస్‌కు పంపగలరు. బ్యాంక్ డ్రాఫ్ట్స్ A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా ..........................

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్, నంబూరు పోస్ట్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

గుంటూరు జిల్లా

# శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు
## అందరూ ఆహ్వానితులే

శ్రీసర్వాధిష్ఠాన చైతన్య విశ్వమత ప్రవక్త సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహారాజ్‌వారి రజతోత్సవ పుణ్యారాధనములు కాళీవనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీకాళీవనాశ్రమం (శ్రీకాళీగార్డెన్స్), నంబూరులో ది. 20-11-2013 బుధవారం నుండి ది. 1-12-2013 ఆదివారం వరకు పంచయజ్ఞ విధులతో జరుపబడును. నిత్యమూ శ్రీగురుగీతా ప్రచనము, శ్రీసద్గురు శతసహస్ర నామార్చనలు, మహామంగళ హారతులు ఉంటాయి. డిసెంబర్ 1వ తేదీ ఉదయం మహాభిషేకం, మహామంగళహారతి, దీక్షావిరమణ.

విశేష కార్యక్రమాలు -

నవంబర్ 20 నుండి బ్రహ్మశ్రీ కొండూరి రామబ్రహ్మంగారి ఆధ్వర్యంలో హెూమము జరుగును.

నవంబర్ 24, 25, 26 తేదీలలో సాధుధర్మ సమ్మేళనము.

నవంబర్ 27న యతి పూజలు.

ఈ ఉత్సవాలలో అఖండ హరినామ సంకీర్తన, సామూహిక సద్గురుపాద పూజలు, నౌకావిహారము, ఊంజల సేవ, నగరోత్సవములు ఉంటాయి.

ఈ కార్య క్రమాలలో ప్రతి భక్త హృదయము పాల్గొనాలని మా ఆకాంక్ష. ఈ కార్యక్రమాలలో పాల్గొనుటకు వీలుగా శలవు పెట్టుకునేందుకు ముందుగా తెలియచేయుచున్నాము.

వివరములకు -

ట్రస్ట్ కార్యాలయము - 0863 2293564

కుమారస్వామి రాజా - 93465 35357

మురళీమోహనవర్మ - 93983 34345

ఎ. కుమారస్వామి - 93945 35357

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

చిన్నప్పుడు చంద్ర శ్రీబాబుతో ఎవరూ మాట్లాడలేనంత చనువుగానూ, చొరవగానూ మాట్లాడేది. అందుకని ఎవరైనా ఏదైనా విషయం చెప్పవలసి వస్తే, తాము స్వయంగా చెప్పుకునే ధైర్యం లేక, చంద్రతో శ్రీబాబుకు చెప్పించేవారు. చంద్రకి చిన్నతనం కనుక అప్పట్లో శ్రీబాబు ఏమీ అనేవారు కాదు.



కాని గురుశిక్షణ నేర్పవలసి వచ్చిన సమయంలో, మితిమీరిన ఆ చనువుకు అడ్డుకట్ట వేశారు శ్రీబాబు. గుంటూరులో పాండుగారింట్లో శ్రీబాబు పూజానంతరం తీర్థం యిస్తూ మౌనముద్రలో ఉన్నారు. ఒక భక్తుడు ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో ఉండగా, అతణ్ణి చూడటానికి వెళ్ళి, అప్పుడే వచ్చింది చంద్ర. అప్పుడు సుమారు 10సం॥ల వయస్సు ఉంటుంది చంద్రకు. ఆ వ్యాధిగ్రస్తుని పట్ల ఎంతో జాలితో, చంద్ర శ్రీబాబు వద్దకు వెళ్ళి, 'పెద్దబ్బాయీ! హనుమంతరావు మావయ్య చాలా ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. మీకు నమస్కారాలు చెప్పి, తనను రక్షించమని మీకు చెప్పమన్నాడు' అన్నది.

మౌన ముద్ర నుంచి లేచిన బాబు తీవ్రస్వరంతో "ఈ కబురు నాకు చెప్పాలని కొంగున మూటకట్టుకుని వచ్చావా? చెప్పటానికి యీ సమయమే దొరికిందా? ఇలా మూటలు మోసుకుని రావటాని కంటే యింక వేరే పనేమీలేదా నీకు?" అని గట్టిగా మందలించారు. ఆ తరువాత చంద్ర ఎప్పుడూ శ్రీబాబుతో అలా చొరవగా మాట్లాడలేదు.

చిరంజీవిరాజుగారు కూడా బాబుకు అత్యంత సన్నిహితులై, ఆత్మీయులైనా శ్రీబాబు ఎదుటికి వచ్చి, ఒక్క మాటకూడ స్వతంత్రంగా, చనువుగా మాట్లాడలేక పోయేవారు. శ్రీబాబు అవ్యాజ ప్రేమమూర్తి కనుక తమతో అత్యంత ప్రసన్నులై మాట్లాడుతున్నారనీ, ఆ మహనీయుని ఔన్నత్యము మేరు పర్వత శిఖరాలను మించినదని, దాని ముందు తాను ఒక ధూళికణిక కంటె చిన్నవాడననే వినమ్ర భావం మనస్సున నిండగా, వినయ భయభక్తులతో రాజుగారు అతి నెమ్మదిగా పదిమాటలకు ఒక మాట శ్రీబాబుతో అనగలిగేవారు. తమ మనస్సులోని భావాన్ని. చంద్రద్వారాగానీ, తల్లిగారి ద్వారాగానీ, లేదా శేషగిరిరావుగారి ద్వారాగానీ శ్రీబాబుకు చెప్పించేవారు.

శ్రీబాబు యింటికి వస్తే ఎంత బ్రహ్మానందంగా ఉండేదో, వారు వెళ్ళిపోతుంటే అంత దిగులుగా ఉండేది రాజుగారికి. వారు శ్రీబాబును వెళ్ళవద్దని, మరి కొన్నిరోజులు ఉండమనీ చంద్రతో అడిగించేవారు. "అమ్మడూ! ఎవరు అడగమన్నారురా?" అని శ్రీబాబు అడిగేవారు. తలుపు వెవకాల ఉన్న రాజుగారిని చూపిస్తూ చంద్ర 'చిన్నబ్బాయి' అనేది. "నేను ఎప్పుడూ నీతోనే ఉంటానుగా" అంటూ మాట తప్పించేవారు బాబు. ఇది కాదని రాజుగారు రాఘవమ్మగారితో అడిగించేవారు. ఆమెకు అసలే భయం, మొహమాటము కాని రాజుగారంటే యింకా ఎక్కువ భయం కనుక, ధైర్యం కూడదీసుకుని 'అవకాశం ఉంటే యింకా ఒకటి, రెండు రోజులు........' శ్రీబాబు నవ్వుతూ "ఏమమ్మా! ఆయన అడగమనేవాడూ, నీవు అడిగేదానవూనా? ఏదైనా మందలింపులుగానీ, చివాట్లుగానీ ఉంటే అవేవో నీవే తింటావు కదా! అని ఆయన ఉపాయమా? అంతగా కావాలనుకుంటే ఆయన్నే అడగమనరాదూ?" అనేవారు. అమ్మో! శ్రీబాబు ఎదురుగా వచ్చి అంత ధైర్యంగా అడగటమే! ఎన్ని గుండెలు కావాలి? అందుకే రాజుగారు రాఘవమ్మగారిని ముందుకు నెట్టేవారు.

శ్రీబాబు ఎప్పుడు వచ్చినా. రాజుగారు వారిని ప్రతిక్షణం నీడవలె వెన్నంటి ఉండేవారు. శ్రీబాబుకు స్నాన పానాదులు, భోజనాది కార్యక్రమాలు స్వయంగా చూసుకుంటూ సంతృప్తికరంగా జరిపితేగాని, ఆయనకు శాంతి ఉండేదికాదు. ఇక స్వామి బయలుదేరక తప్పదు అని తెలిసినప్పుడు తాము కూడా స్వామి వెంట బయలుదేరే వారు.

"నీవు గృహస్థుడవు. నీవు సమర్థించుకోవలసిన సంసార విషయాలు ఎన్నో ఉంటాయి. అవన్నీ వదిలిపెట్టి, నాబోటి బైరాగితో తిరగటం ధర్మం కాదు" అనేవారు శ్రీబాబు. చేసేది లేక రాజుగారు శ్రీబాబు జేబులో వారికి తెలియకుండా వంద రూపాయల నోట్లు కొన్ని ఉంచేవారు. స్వామి దేశమంతటా సంచరిస్తారని రాజుగారికి తెలుసు. అందుకని కొంతైనా ఉపయోగపడుతుందని రాజుగారి భావన. కాని శ్రీబాబు బయలుదేరేముందు జేబు తడిమి చూసుకుని రాజుగారు పెట్టిన డబ్బంతా బయటకి తీసేసేవారు. రాజుగారు దిగులుగా 'బాబూ! అది తమరిదే. తమది కానిది నా దగ్గర ఏమున్నదని? కొంచెమైనా ఉంచండి బాబూ!' అని బ్రతిమిలాడేవారు. బాబు తాము అట్టే దూరం వెళ్ళటం లేదనీ, గూడెమో, బెజవాడో అని చెప్పి తప్పించుకోజూసేవారు. 'ఇంకేమీ దగ్గరే కదా! నేనూ మీతో కూడా వస్తాను బాబూ!' అని రాజుగారు బ్రతిమాలే వారు. శ్రీబాబు కాదనలేకపోయేవారు.

– సశేషం

# శ్రీ రాధా మాధవ రస సుధ

- శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

హే హారాధ్యా! రాధా! నా మనస్సు నీలో నిత్యనివాసి.
నీ దర్శన ప్రాప్తికోసమే నేను గోకులంలో నివసిస్తున్నాను.

నీ రస తత్త్వ గ్రహణ కోసం, దానిని ఆస్వాదించటం కోసమే
రాత్రింబవళ్ళు వేణునాదం చేస్తూ, సంచరిస్తూ ఉంటాను.



దానికోసమే యమునకు స్నానానికి
వెళ్తున్నాను ఆ తీరంలో కూర్చుంటున్నాను.

నీ మధుర రూప దర్శనం కోసం నా చిత్తం
తహతహలాడుతున్నది.

దాని కోసమే కదంబవృక్ష మూలంలో
కూర్చుని నిత్యమూ నీ ధ్యానం చేస్తూ
ఉంటాను.
సదా స్వాతి వానకై సతృష్ణగా ఎదురుచూసే
చాతకం లాగ
నీ రూపామృతము గ్రోలుటకై దప్పిక గొని ఉన్నాను.

నీ రూపగుణశీలముల మధుర మాధురి నిత్యమూ నా చిత్తాని వశం
చేసుకుంటున్నది.
నిత్యమూ నీ ప్రేమ గానం చేసుకుంటూ, సదా దానిలో లీనమై ఉంటున్నాను.

.....................

నీ శ్యామసుందరుడు



## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

గతసంచిక తరువాయి

# జ్ఞానదేవుడు

**<u>జ్ఞానదేవుడు దున్నపోతు చేత వేదము చెప్పించుట.</u>**

"మాతల్లిదండ్రులు మరణించారు. మాకు ఉపనయన సంస్కారాలు జరిపించండి" అని జ్ఞానదేవుడు పురోహితుల వద్దకు వెళ్ళారు, నివృత్తి, సోపాన్, ముక్తాబాయిలు వెంటరాగా. ప్రధాన పురోహితుని గృహద్వారం వద్ద పురోహితులు అడ్డగించి ''శుద్ధి సంస్కారం కానిదే ప్రధాన పురోహితులను చూడటానికి మీకు అర్హత లేదు" అని చెప్పారు.



నివృత్తినాధుడు ముందుకు వచ్చి "నాకు ప్రవృత్తితో పనిలేదు" అన్నాడు.

"నేను జ్ఞానదేవుడను. చైతన్యస్వరూపమును ఎరిగినవాడను" అన్నాడు.

సోపానుడు,"సర్వులను భగవన్నామము నందు లయించునట్లు చేసి ముక్తిధామానికి సోపానాలు ఏర్పాటు చేయువాడను" అన్నాడు.

నేను ముక్తాబాయిని అందరికి ముక్తి ద్వారాన్ని తెరుస్తాను అంది.

ఆ మాటలకు చకితులైన పురోహితులు ఆగ్రహావేశాలతో దారినపోతున్న దున్నపోతుని చూపి "అదిగో దున్నపోతు. నీవు ఆ దున్నపోతూ సమానమేనా?" అని జ్ఞానదేవులవారిని ప్రశ్నించారు. జ్ఞానదేవులవారు నవ్వుతూ "సందేహము లేదు అందరిలో ఉన్నదీ ఒకే చైతన్యం. మీరు ఉపాధిని చూస్తూ అసలు వస్తువును దర్శించలేక పోతున్నారు" అన్నాడు.

"ఏమిటీ! మాకే జ్ఞానం బోధిస్తున్నావా? అందరిలో ఉన్నది ఒకే చైతన్యం అయితే ఆ దున్నపోతు మాట్లాడగలదా?" అని అడిగాడు పురోహితుడు.

జ్ఞానదేవుడు నిశ్చలచిత్తంతో "మీరు బ్రహ్మవేత్తలు. మీ నోటినుంచి వచ్చిన మాటలు వృధాకావు. దున్నపోతు మాట్లాడటమే కాదు, వేదమంత్రాలను ఉచ్ఛరించగలదు" అని వెళ్ళి తన చేతిని దున్నపోతు శిరస్సుపై ఉంచాడు. వెంటనే శృతిబద్ధంగా దున్నపోతు వేదమంత్రాలను ఉచ్ఛరించసాగింది.

అందరూ నివ్వెరపోయారు. ఈ వింతను దర్శించటానికి ప్రజలంతా గుమికూడారు. ప్రధాన పురోహితుడు బయటకు వచ్చి చూసి నిర్ఘాంతపోయాడు. జ్ఞానదేవుడు దైవాంశ సంభూతుడు అని గ్రహించాడు. జ్ఞానదేవుడు తన చేతిని దున్నపోతు శిరస్సునుండి తీయగానే మంత్రోచ్ఛారణ ఆగిపోయింది. ప్రధాన పురోహితుడు వారికి ఉపనయనం చేయించాడు.

***<u>జ్ఞానదేవుడు శ్రాద్ధమును నెరవేర్చి బ్రాహ్మణుని రక్షించుట.</u>***

దున్నపోతు వేదం చెప్పటం విన్న ఒక బ్రాహ్మణుడు, నివృత్తినాధునికి, జ్ఞానదేవునికి, సోపానదేవునికి,ముక్తాబాయికి,తన ఇంట ఆశ్రయమిచ్చాడు. ఆ గ్రామ పురోహితులు అవేశపరులై అతనిమీద దోషారోపణ చేసి తమ జాతి నుండి వెలివేశారు.

ఒకనాడు ఆ బ్రాహ్మణుడు తన తండ్రికి శ్రాద్ధము చేస్తూ తనకు మిత్రులుగా ఉన్న శ్రోత్రియులను పిలవటానికి వెళ్ళాడు. వారు, కులమువారు పెట్టిన నిర్బందములకు భయపడి 'వచ్చుటకు వీలు లేద'ని చెప్పారు. జ్ఞానదేవుడు అతనిని చూసి "స్వామీ తమరు చింతాక్రాంతులై ఉండటానికి కారణం ఏమిటి?" అని అడుగగా, మిమ్ము నా ఇంట ఉంచుకొని ఆదరించినందున ఈ మూర్ఖ బ్రాహ్మణులు నన్ను జాతినుండి బహిష్కరించారు. నేడు నా తండ్రి శ్రాద్ధము. బ్రాహ్మణులు లేకపోతే శ్రాద్ధకర్మ జరుగదు. నాకు ఏమీ పాలుపోవటం లేదు" అన్నాడు.

జ్ఞానదేవుడు 'దుష్టులను, ధర్మభ్రష్టులను సర్వోత్కృష్టులని భావించి పూజించటం అవివేకం. స్వామీ! బ్రహ్మమును తెలిసికొనినవాడే బ్రాహ్మణుడు. బ్రాహ్మణత్వానికి తపస్సు కారణం. గుణమే ప్రధానం కానీ కులం ప్రధానం కాదు. దీనికి ప్రమాణంగా మహిషంచేత చెప్పించినా ఈ మూర్ఖులకు బుద్దిరాలేదు. పితృదేవతలకు అర్పించిన పదార్ధాలను పితృదేవతులుగాని, సద్బ్రాహ్మణులుగానీ భుజించాలి కానీ ఇటువంటి దుష్టులు కాదు. ఒకవేళ పితృదేవతలే వచ్చినచో వారిని పూజించి భోజనాదులతో సంతృప్తి పరుస్తావా?' అని అడిగాడు.

"వారికి భోజనంపెట్టి సంతృప్తి పరచటానికి ఆటంకం ఏముంది? వారికొరకే కదా ఈ శ్రాద్ధకర్మ చేయటం?" అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

"అలా అయితే మీ పితృదేవతలను ఇప్పుడే రప్పిస్తాను, మీరు శ్రాద్ధకర్మకు కావలసిన పదార్థాలను సిద్ధం చేసుకొమ్మ"న్నాడు జ్ఞానదేవుడు. అక్షతలు తీసుకొని పైకి చూచి ఈ బ్రాహ్మణుని ఇంటికి వచ్చి శ్రాద్ధము నెరవేర్చండి" అని నిమంత్రణము చేశాడు జ్ఞానదేవుడు.

పితృదేవతలు ఆకాశమార్గాన దివ్యవిమానంలో ఆ బ్రాహ్మణుని ఇంటికి వచ్చారు. భక్తి ప్రపత్తులతో వారికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి ఉచితాసనం మీద

కూర్చుండబెట్టి పూజించి, సమస్త పదార్ధాలను వడ్డించి "పిత్రురూపో జనార్దనం" అని చెప్పి ఆపోశనం పోశాడు ఆ బ్రాహ్మణుడు.

పితృదేవతలు పరమానందభరితులై భోజనాలు చేస్తున్నారు. ఆ గ్రామ వైదికులు ఆ బ్రాహ్మణుని ఇంటికి వచ్చిన దివ్యవిమానమును చూసి, పరిగెత్తుకు వచ్చి దివ్యకాంతులతో పీటలమీద కూర్చొని భోజనము చేస్తున్న పితృదేవతలను చూసి ఆశ్చర్యచకితులై ఏమీతోచక నిల్చున్నారు.

పితృదేవతలు "పుత్రవంతుడవై, చిరాయుష్మంతుడవై సకల సంపదలతోను సుఖింతువుగాక" అని దీవించి, విమానం ఎక్కి ఆకాశమార్గాన వెళ్ళిపోయారు.

ఆ పురవాసులు ఈ అద్భుతాన్ని చూసి "ఈ బ్రాహ్మణుల మూర్ఖత్వమే వీరిని ఈస్థితికి తెచ్చినది" అని అన్నారు. బ్రాహ్మణులు తెలివితెచ్చుకొని 'ఆహా! ఈ నివృత్తిదేవుడు, జ్ఞానదేవుడు, సోపానదేవుడు త్రిమూర్తులు. ముక్తాబాయి సాక్షాత్తు పరాశక్తి. అజ్ఞానులమైన మేము మీ మహాత్మ్యాన్ని గుర్తించలేక అపరాధం చేశాము, మన్నించండి' అని సాష్టాంగ పడి నమస్కారం చేశారు.

జ్ఞానదేవుడు, "కులభ్రష్టులమైన మాకు నమస్కారం చేస్తే మీరు అగ్నిప్రవేశము చేసి దేహత్యాగం చేసుకోవాల్సి ఉంటుంది.' అన్నాడు.వారు పశ్చాత్తాపంతో "మేము చేసిన అపరాధాలను మన్నించి మమ్ము రక్షించండి, మమ్ము మీ శిష్యులగా చేసుకొని అనుగ్రహించండి" అని వేడుకొన్నారు.

జ్ఞానదేవుడు వారిని మన్నించి వారందరికీ విస్తళ్ళు వేయించి వారి కోరిక మేరకు తాము కూడా వారి పంక్తిలో కూర్చొని భుజించారు.

బ్రాహ్మణులందరూ సభచేసి "వీరు పరమపవిత్రులు, వీరికి ప్రాయశ్చిత్తమా! వీరి పాదతీర్థమే మూడులోకాలను పావనం చేసే గంగాజలము. వీరి పాద ధూళి సోకిన స్థలమే దివ్యస్థలము. వీరు సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపులు. వీరిని సేవిస్తే మోక్షము సులభముగా ప్రాప్తిస్తుంది" అని నిరాపేక్ష నిరూపణమును వ్రాసి ఇచ్చారు.

జ్ఞానదేవుడు వారికి తత్వోపదేశము చేశాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL